విలేఖరులు కావలెను
ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..
స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com

ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :76 నల్గొండ శనివారం 07-06-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ పేజీలు : 4 వెల : రూ.1/-

## నాలా ఆక్రమణలు క్లియర్ చేస్తాం : హైడ్రా చీఫ్ రంగనాథ్



హైదరాబాద్,వర్షాకాలం ప్రారంభంతో హైడ్రా అధికారులు హైదరాబాద్ సిటీలో నాలాల సమస్యపై ప్రత్యేక దృష్టిసారించారు. నాలాలపై ఆక్రమణలను అరికట్టేందుకు.. ఇప్పటికే ఉన్నవాటిని తొలగించేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. ఈ మేరకు నగరంలోని నాలాలపై ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించినట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఈ కార్యక్రమాన్ని మరింత ముమ్మరం చేయనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లో నాలాలపై నిర్మించిన వాణిజ్య సముదాయలను కూల్చివేతలను శుక్రవారం ఉదయం ప్రారంభించారు.

70 అడుగుల నాలా.. 15 అడుగులకు

కాగా, 70 అడుగుల విస్తీర్ణంలో ఉండాల్సిన నాల కబ్జాలతో 15 నుంచి 18 అడుగులకు పరిమితమైన చోట హైడ్రా చర్యలు చేపట్టింది. నాల ఆక్రమణకు గురి అవ్వడంతో పాయిగ కాలనీ, ప్యాట్నీ కాంపౌండ్, ప్యాట్నీ కాలనీ, విమాన నగర్, బెల్ కాలనీ, ఇందిరమ్మ నగర్ నీట మునుగుతున్నట్టు అంతకు ముందు హైడ్రాకు స్థానికులు ఫిర్యాదులు చేశారు%ౌ% ఫిర్యాదులను గురువారం కంటోన్మెంట్ సిఈవో మధుకర్ నాయక్, మున్సిపల్, ఇరిగేషన్ శాఖకు చెందిన అధికారులతో కలసి పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. ఈ సందర్బంగా నాలా ఆక్రమణలతో వేలాది నివాసాలు నీట మునిగిన పాత చిత్రాలను సెల్ఫోన్లలో రంగనాథ్ కు స్థానికులు చూపించారు.. 70 అడుగులకు పైగా ఉన్న నాలా 55 నుంచి నుంచి 60 అడుగుల మేర ఆక్రమణలు గురి అయినట్టు నిర్ధారించారు అధికారులు. ఆక్రమణలు తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు.. అలాగే భవిష్యత్ లో ఆక్రమణలకు గురి కాకుండా వెంటనే హద్దులు నిర్ణయించి నాలకు ఇరువైపులా ప్రహరీలు నిర్మించాలని కంటోన్మెంట్ అధికారులు నిర్ణయించారు. ఇక నేటి ఉదయం నాల ఆక్రమణల కూల్చివేతలు ప్రారంభించింది.. దీంతో అయిదు కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. దశాబ్దాల నరకానికి మోక్షం లభించింది అంటూ సంతోషం వ్యక్తం చేసి హైడ్రా చీఫ్ కు కృతజ్ఞతలు తెలిపారు స్థానికులు.

అన్ని నాలాలపై ఆక్రమణలను తొలగిస్తాం: రంగనాథ్

రాబోయే నాలుగు నెలల పాటు నాలాల అంశంపైనే పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించనున్నట్లు కమిషనర్ రంగనాథ్ ఈ సందర్భంగా మీడియాకు వివరించారు. ముఖ్యంగా నగరంలో వరద నీరు తరచుగా నిలిచిపోయే ప్రాంతాలను గుర్తించి, వాటిపై ప్రత్యేకంగా అధ్యయనం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అధ్యయనం ద్వారా సమస్య మూలాలను కనుగొని, శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. నాలాలు, ఇతర నీటి వనరులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రంగనాథ్ హెచ్చరించారు. ముఖ్యంగా నాలాలపై అక్రమంగా నిర్మించిన వాణిజ్య భవనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, వాటిని తక్షణమే తొలగిస్తామని ఆయన తేల్చి చెప్పారు. అయితే, పేదలు నివాసం ఉంటున్న నిర్మాణాల విషయాన్ని మానవతా దృక్పథంతో పరిశీలించి, ఆ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఈ దిశగా చర్యలు ప్రారంభమయ్యాయని, దానికి ఉదాహరణగా రసూల్‌పురా నాలాపై ఉన్న అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించినట్లు కమిషనర్ రంగనాథ్ గుర్తు చేశారు. నగరంలో నాలాల వ్యవస్థను పరిరక్షించి, వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా తమ ప్రణాళికలు కొనసాగుతాయని ఆయన దృఢంగా చెప్పారు.

## కాశ్మీర్‌లో మరో అద్భుతం ఆవిష్కరణ

శ్రీనగర్,జూన్6:ప్రపంచంలోనే ఎత్తైన చినాబ్ రైల్వే వంతెనను ప్రధాని మోదీ అట్టహాసంగా ప్రారంభించారు. ఆపరేషన్ సిందూర్ తరవాత తొలిసారిగా ప్రధాని మోడీ కాశ్మీర్‌కు వెళ్లారు.శుక్రవరాం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జమ్ము కశ్మీర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ కేంద్రం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి చీనాబ్ రైలు వంతెనను ప్రధాని ప్రారంభించారు. జెండా ఊపి రైల్వే వంతెనపై రాకపోకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే బ్రిడ్జిపై పరుగులు తీసిన కోచ్‌లో ప్రధాని ప్రయాణించారు. ఆయన వెంట కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా కూడా ఉన్నారు. భారత దేశం మరో అద్భుత కట్టడానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. చీనాబ్ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మాణం జరిగింది. చీనాబ్ రైల్వే బ్రిడ్జిగా పిలువబడుతున్న ఈ బ్రిడ్జి శుక్రవారం ఉదయం ప్రారంభం అయింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం ఉదమ్‌పూర్.. శ్రీనగర్.. బారాముల్లా రైల్ లింక్ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు.. ఈ చినాబ్ రైల్వే వంతెన ఈఫిల్ టవర్ కంటే ఎత్తుగా ఉంటుంది. ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెన చినాబ్ సొంతం. అలాంటి రైల్వే వంతెనను ప్రధాని మోదీ శుక్రవారం జాతికి అంకింతం చేశారు. రూ.46వేల కోట్లతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా నుంచి శ్రీనగర్ వరకు వందే భారత్ రైలును కూడా జెండా ఊపి ప్రారంభించారు. వంతెన కారణంగా ఈ మార్గం ప్రధానంగా పర్యాటరంగాన్ని మరింత ఆకర్షించనుంది. శ్రీ మాతా వైష్ణో దేవి ఆలయాన్ని వందలాది మంది యాత్రికులు దర్శిస్తుంటారు. ఈ రైల్వే వంతెన ప్రారంభంతో పర్యాటకరంగంగా మరింత పుంజుకోనుంది. ఈ చినాబ్ బ్రిడ్జి 1,315 మీటర్లు విస్తరించి ఉంది. కఠినమైన వాతావరణాన్ని కూడా ఈ వంతెన తట్టు-కోగలదు. ఈ ప్రాంతం భూకంపం జోన్ 5లో ఉంది. ఇంజనీర్లు అత్యంత అద్భుతంగా ప్రణాళికలు వేసి ఈ బ్రిడ్జిని నిర్మించారు. గంటకు 260 కిలోమీటర్ల వేగంతో ప్రచండమైన గాలులు వీచినా ఈ వంతెనకు ఏం కాదు. బలమైన గాలులు తట్టుకునే విధంగా



నిర్మించారు. ఇక వంతెన నిర్మించడానికి దాదాపు 30,000 టన్నుల ఉక్కును ఉపయోగించారు. ప్రస్తుతం ఇదే ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెనగా నిలుస్తుంది. చీనాబ్ వంతెన నిర్మాణం 2002లో వాజ్‌పేయ్ హయాంలో ప్రారంభించగా 2022లో మోడీ హయాంలో పూర్తయ్యింది. ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు మార్గం ప్రాజెక్టులో భాగంగా ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి విజయవంతంగా ముగించారు. శనివారం నుంచి శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా రైల్వే స్టేషన్ నుంచి శ్రీనగర్ వరకు వందే భారత్ రైళ్లు పరిగెత్తనున్నాయి. ప్రధాని ప్రారంభించిన చీనాబ్ రైల్వే బ్రిడ్జి ప్రత్యేకతల విషయానికి వస్తే.. ఇది ఈఫిల్ టవర్ కంటే చాలా ఎత్తైనది. ఈఫిల్ టవర్ ఎత్తు 330 మీటర్లు మాత్రమే. కానీ, ఈ బ్రిడ్జి ఏకంగా 359 మీటర్ల ఎత్తులో ఉంది. ఈ బ్రిడ్జి పొడవు 1,315 మీటర్లు. కట్టింగ్ ఎడ్జ్ ఇంజనీరింగ్ టెక్నాలజీతో దీన్ని నిర్మించారు. ఈ బ్రిడ్జి గంటకు 266 కిలోమీటర్ల వేగంతో గాలి వీచినా కూడా ఏమాత్రం చెక్కు చెదరదు. ఈ బ్రిడ్జిలో ఆసక్తికరమైన మరో ప్రత్యేకత ఏంటంటే.. ఆ బ్రిడ్జి బ్లాస్ట్ రెసిస్టంట్ స్టీలు, కాంక్రీట్‌తో తయారు అయింది. బాంబు దాడులను సైతం బ్రిడ్జి తట్టుకుని నిలబడగలదు.

## పెద్దమ్మ ఆశీస్సులతో అన్నింటా శుభం జరగాలి

చిన్నకోడూరు: పెద్దమ్మ ఆశీస్సులతో అన్నింటా శుభం జరగాలని మాజీ మంత్రి ,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు (మాజీ మంత్రి హరీష్ రావు) అన్నారు. చిన్నకోడూరు మండలం రామంచ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దమ్మ దేవాలయం పునర్నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. పెద్దకోడూరులోని మెట్టు బండల వద్ద పెట్రోల్ పంపును (పెట్రోల్ పంపు) గోనేపల్లిలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్టలో ఉంది.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ సిద్ధిపేట(సిద్దిపేట) నియోజకవర్గంలో ముదిరాజ్‌లకు రూ. 5 కోట్లతో రాష్ట్రంలోనే ఆదర్శంగా ముదిరాజ్ భవనం నిర్మించామని చెప్పారు. ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో పెద్దమ్మ దేవాలయం నిర్మించామని, అన్ని దేవాలయాలకు తన సహకారం అందించామని గుర్తుచేశారు. గత ప్రభుత్వం హయాంలో మత్స్య కారులకు ఆర్థికంగా భరోసానిచ్చింది.ఈ కార్యక్రమ ంలో రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ, మాజీ ఎంపీపీ కూర మాణిక్య రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్,ఉమ్మడి మెదక్ జిల్లా గొర్ల పెంపకం దారుల మాజీ అధ్యక్షుడు శ్రీహరి యాదవ్, గంగాపూర్ సొసైటీ చైర్మన్



కనకరాజు, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేడికాయల వెంకటేశం, జంగిటి శ్రీనివాస్, ఇట్టబోయిన శ్రీనివాస్, శ్రీకాంత్ యాదవ్, బట్టు లింగం, ఎల్లా గౌడ్, కొండం రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సంఘం నాయకులు,కార్యకర్తలు, కొనసాగుతున్నారు.

## నీట్- 2025 ఎంట్రన్స్ టెస్ట్ వాయిదా




న్యూఢిల్లీ,జూన్6: నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ నీట్- 2025 పరీక్షను వాయిదా వేయాలన్న నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అభ్యర్థనకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఆమోదం తెలిపింది. జూన్ 15వ తేదీన జరగాల్సిన పరీక్షను ఆగస్టు 3వ తేదీన నిర్వహించేందుకు అనుమతి ఇచ్చింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా న్యాయమూర్తి పీకే మిశ్రా నేతృత్వంలోని బెంచ్.. పరీక్ష వాయిదాపై కేంద్రాన్ని, ఎన్‌బీఈని ప్రశ్నించింది. 'ఇంకా రెండు నెలలు పరీక్షను వాయిదా వేయటం ఎందుకు..జులై రెండు లేదా మూడో వారంలో పరీక్ష నిర్వహించవచ్చుగా' అని అడిగింది. కేంద్రం తరఫున అదనపు సోలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ స్పందిస్తూ..' లాజిస్టికల్ సవాళ్ల కారణంగా పరీక్ష వాయిదా పడింది. పరీక్ష కేంద్రాల సంఖ్యను రెట్టింపు చేయడం, కఠినమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టడం వంటి వాటి కోసం ఈ నిర్ణయం తీసుకోవటం జరిగింది. చిన్న పొరపాట్లు- పరీక్ష ప్రక్రియపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే పరీక్షను వాయిదా వేయడానికి ఎన్బీఈ నిర్ణయించిందని తెలిపారు.అనంతరం న్యాయమూర్తి మిశ్రా మాట్లాడుతూ.. ' పరీక్ష ఎప్పుడు జరిగినా నిష్పక్షపాతంగా, సమగ్ర భద్రతతో జరగాలని స్పష్టం చేశారు. గత వారం ఇచ్చిన తీర్పును కూడా సుప్రీంకోర్టు ప్రస్తావించింది. అప్పటి నుంచి మీరు ఏం చేశారంటూ ఎన్‌బీఈని ప్రశ్నించింది. దీనిపై ఎన్‌బీఈ మాట్లాడుతూ.. ' పరీక్ష విషయంలో మేము ఏమాత్రం రాజీ పడదలచుకోవడం లేదని స్పష్టం చేసింది. కాగా, నీట్ పీజీ పరీక్షను రెండు షిఫ్టుల్లో జరపడానికి పర్మిషన్ కోరుతూ ఎన్‌బీఈ గతంలో సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దానిపై విచారణ జరిపిన కోర్టు ఎన్‌బీఈ ప్రతిపాదనను తోసిపుచ్చింది. రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరిగితే విద్యార్థులపై చెడుగా ప్రభావం చూపే అవకాశం ఉందని అభిప్రాయపడింది. దేశ వ్యాప్తంగా ఒకే షిఫ్టులో పరీక్ష పెట్టాలని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే పరీక్ష ఒకే షిఫ్టులో జరపడానికి మరింత సమయం కావాలని బోర్డు కోరింది. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన కోర్టు ఆగస్టు 3వ తేదీన పరీక్ష జరపడానికి అవకాశం కల్పించింది. ఒకే షిఫ్ట్‌లో పరీక్షను ముగించాలని ఇటీవల అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పరీక్ష నిర్వహణ తేదీని జూన్ 15 నుంచి మార్చుకునేందుకు వీలు కల్పించింది.వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే జాతీయస్థాయి అర్హత పరీక్ష (నీట్)కు సంబంధించి ఇటీవల సుప్రీంలో విచారణ జరిగింది. పరీక్షను రెండు షిఫ్ట్‌లలో నిర్వహించడానికి నిరాకరించింది. దానివల్ల కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొంది. పరీక్ష నిర్వహణలో పూర్తి పారదర్శకతను పాటించాలని, సురక్షితమైన పరీక్షా కేంద్రాలనే ఎంచుకోవాలని సూచించింది. రెండు ప్రశ్నపత్రాలు ఎప్పటికీ ఒకేవిధమైన కాఠిన్య లేదా సులభ స్థాయిని కలిగిఉండవని అభిప్రాయపడింది. పోటీ- తీవ్రత దృష్ట్యా ప్రతి మార్కు ర్యాంకు నిర్ధరణలో అత్యంత కీలకమేనని తెలిపింది. నార్మలైజేషన్ విధానాన్ని కొన్ని ప్రత్యేక కేసుల్లో మాత్రమే అనుసరించాలని, ప్రతి ఏడాదీ నిర్వహించుకొనే పరీక్షకు అది సరికాదని ధర్మాసనం పేర్కొంది.

## ట్రంప్,మస్క్ మధ్య దోస్తాన్ ఎక్కడ చెడింది..?




వాషింగ్టన్,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గెలుపుకి ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఆర్థికంగా ఎంత సాయం చేశారో అందరికీ తెలిసింది. అయితే, గెలిచిన తర్వాత ట్రంప్ కి అత్యంత సన్నిహితుడిగా మారిన మస్క్ డోజీ ద్వారా ఖర్చులు తగ్గించేందుకు కీలకంగా పని చేశారు.కానీ, ప్రస్తుతం ట్రంప్ తీసుకొస్తున్న బిగ్ బ్యూటిఫుల్ టాక్స్ బిల్ వీరి మధ్య దోస్తాన్ కి బీటలువార్చింది. ట్యాక్స్ తగ్గింపు బిల్లును ట్రంప్ సపోర్టు ఇస్తుండగా.. మస్క్ దానిపై బాహాటంగానే వ్యతిరేకిస్తున్నారు. కాగా, టెస్లా చీఫ్ తన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తనకు ఎదురు తిరడంపై స్పందించిన అమెరికా అధినేత నేను అస్సలు పట్టించుకోనని సమాధానం ఇచ్చాడు. తాను తెస్తున్న బిల్లు ద్వారా ఖర్చులను 1.6 ట్రిలియన్ డాలర్లు తగ్గడంతో పాటు పన్ను తగ్గింపులు లభిస్తాయని వెల్లడించారు.

అయితే, బిల్ పాస్ కాకుండా నిలిపివేస్తే ప్రస్తుతం ఉన్న దాని కంటే 68 శాతం అధిక ట్యాక్సులు విధిస్తానని ట్రంప్ బెదిరించారు.అయితే, మరోపక్క ఎలాన్ మస్క్ తన ఎక్స్ ఖాతాలో తాను లేకపోతే డొనాల్డ్ ట్రంప్ ఖచ్చితంగా అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయే వారని చేసిన పోస్ట్ తీవ్ర దుమారం రేపుతోంది. మస్క్ చేసిన ఈ కామెంట్స్ తనను తీవ్ర నిరాశకు గురి చేశాయని ట్రంప్ అన్నారు. మా ఇద్దరికీ మంచి దోస్తాన్ ఉంది.. అయితే ఇకపై అది కొనసాగుతుందని తాను అనుకోవటం లేదని చెప్పుకొచ్చారు. అసలు బిల్లు తయారీలో ఏం జరుగుతుందనే విషయం అందరికంటే ఎక్కువ మస్క్ కి తెలుసని.. ఇప్పుడెందుకు ఇలా అతడు మారిపోయాడో అర్థం కావటం లేదని డొనాల్డ్ ట్రంప్ చెప్పుకొచ్చారు.కాగా, అమెరికాలో అత్యంత గోప్యంగా ఉంచబడిన ఎప్‌స్టిన్ ఫైళ్లలో డొనాల్డ్ ట్రంప్ పేరు ఉందని ఎలాన్ మస్క్ పెద్ద బాంబు పేల్చారు. నిజాలు అన్ని భవిష్యత్తులో బయటకు వస్తాయంటూ ట్వీట్ చేశాడు. అందుకే ట్రంప్ ఈ పత్రాలు బయటకు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ట్రంప్ గతంలో ఎప్‌స్టిన్‌తో తనకు గతంలో పరిచయం ఉందని ఒప్పుకున్నప్పటికీ, తన నేర కార్యకలాపాలలో తనకు ఎలాంటి ప్రమేయం లేదని చెప్పుకొచ్చాడని మస్క్ గుర్తు చేశారు.

## కాళేశ్వరం కమిషన్ విచారణకు ఈటెల

హైదరాబాద్, జూన్ 6: కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ విచారణ మరోసారి మొదలైంది. ఇందులో భాగంగా బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. ఈరోజు (శుక్రవారం) ఉదయం శామీర్‌పేట నివాసం నుంచి బీఆర్‌కే భవన్‌కు చేరుకున్నారు ఎంపీ. ఈటల రాజేందర్ వెంట పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. కాళేశ్వరం కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్ బీఆర్‌కే భవన్‌కు చేరుకోవడంతో విచారణ ప్రారంభమైంది.కాగా.. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవలపై న్యాయవిచారణ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈరోజు విచారణకు రావాల్సిందిగా ఈటెలకు ఇదివరకే కాళేశ్వరం కమిషన్ నోటీసులు పంపించింది. దీంతో నేడు కమిషన్ ముందు విచారణకు ఎంపీ హాజరయ్యారు. బ్యారేజీల నిర్మాణ సమయంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈటెల ఆర్థిక మంత్రిగా పనిచేశారు. బ్యారేజీల నిర్మాణాలకు నిధులు విడుదల, మంత్రి మండలి తీర్మానాలపై కమిషన్ ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు జరిగిన విచారణలో ప్రస్తుత మాజీ ఈఎన్సీలు, సీఈలు, ఐఏఎస్ అధికారులు.. కమిషన్ ముందు విచారణకు హాజరై ఆర్థిక సంబంధమైన పలు అంశాలపై వాంగ్మూలం ఇచ్చారు.వారు పేర్కొన్న అంశాల ఆధారంగా ఆర్థిక సంబంధమైన లోపాలు, నింబంధనల ఉల్లంఘనలు ఏమైనా చోటు చేసుకున్నాయా, నాడు జరిగిన నిర్ణయాలు ఏమిటి అనే విషయాలపై ఈటెలను కమిషన్ ప్రశ్నించే అవకాశం ఉంది. ఈ క్రమంలో అప్పటి మంత్రి అయినప్పటికీ ప్రస్తుతం బీజేపీ



ఎంపీగా ఈటెల ఉన్న నేపథ్యంలో కమిషన్ ముందు ఏ విషయాలు తెలియజేస్తారా అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఇక మరోవైపు ఈనెల 11న విచారణకు రావాల్సిందిగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కూడా కమిషన్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అంతకు ముందు జూన్ 5 నే విచారణకు రావాల్సిందిగా కేసీఆర్‌కు కమిషన్ నోటీసులు పంపింది. అయితే సమయం కావాలని కోరడంతో ఈనెల 11కు విచారణకు రావాలని కమిషన్ పేర్కొంది. అలాగే మాజీ మంత్రి హరీష్ రావుకు కూడా కమిషన్ నోటీసులు ఇచ్చింది. దీంతో ఈనెల 9న కమిషన్ ముందు హరీష్ రావు విచారణకు హాజరుకానున్నారు.

## రోజు రోజుకి పెరుగుతున్న కరోనా కేసులు, మరణాలు

న్యూ ఢిల్లీ : దేశంలో మహమ్మారి కరోనా వైరస్ కేసులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. కరోనా బారిన పడిన వారి సంఖ్య నేటికి ఐదు వేలు దాటింది. ప్రస్తుతం దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 5,364గా ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. పలు రాష్ట్రాలలో 4,724 మంది కోలుకుని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని.. ఇప్పటివరకు వైరస్‌తో దేశవ్యాప్తంగా 55 మంది మరణించినట్లు పేర్కొంది.కాగా, గత 24 గంటల్లో 498 కొత్త కరోనా వైరస్ కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో వైరస్‌తో నలుగురు మృతి చెందారు. మరణించిన వారిలో ఇద్దరు కేరళకు చెందిన వారు కాగా.. కర్ణాటక, పంజాబ్‌లలో



## సంపాదకీయం

శనివారం 07-06-2025

# పర్యావరణానికి యుద్ధ గాయాలు

ప్రపంచ పర్యావరణ దినోత్సవం. మానవాళి ఇప్పుడు సైనిక సంఘర్షణలు, వాతావరణ ప్రకోపాల మధ్య నలిగిపోతోంది. ఒకపక్క అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుంటే, మరోపక్క యుద్ధాలతో ప్రపంచానికి ప్రాదేశికంగా, రాజకీయంగా సవాళ్లు ఎదురవుతున్నాయి. ధనిక దేశాల విపరీత ధోరణుల వల్ల సైనిక ఉద్గారాలు పెరిగి వాతావరణ మార్పులు మరింత వేగవంతమవుతున్నాయి. ఇప్పటికైనా దేశాలన్నీ యుద్ధ కాలుష్య కట్టడికి గట్టి పూనిక వహించాలి.నిరుడు ప్రపంచ దేశాల మొత్తం రక్షణ వ్యయం సుమారు 2.72లక్షల కోట్ల డాలర్లకు చేరింది. 1988 తరవాత 2024లోనే ప్రపంచ దేశాలు రక్షణపై రికార్డు స్థాయిలో నిధులు వెచ్చించాయని స్టాక్‌హోమ్‌లోని అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ(సిప్రీ) ఆందోళన వ్యక్తంచేసింది. సాయుధ దళాలపై చేతికి ఎముక లేనట్లు ఖర్చుచేస్తున్న ధనిక దేశాలకు- పారిస్ తీర్మానం మేరకు వాతావరణ మార్పులను ఎదుర్కోవడం కోసం వర్ధమాన దేశాలకు పదివేల కోట్ల డాలర్లు విదల్చడానికి మాత్రం చేతులు రావడం లేదు. యుద్ధాలు, సైనిక దళాల కారణంగా పెద్దయెత్తున కర్బన ఉద్గారాలు వాతావరణంలోకి విడుదల అవుతున్నాయి.

### ప్రమాదంలో భూగోళ భవిష్యత్తు

అమెరికా రక్షణ వ్యయం నిరుడు 99,700 కోట్ల డాలర్లు. చైనా అందుకు 31,400 కోట్ల డాలర్లు, రష్యా 14,900 కోట్ల డాలర్ల చొప్పున వెచ్చించాయి. మొత్తం ప్రపంచ రక్షణ వ్యయంలో ఈ మూడు దేశాల వాటాయే 60శాతం! రష్యాతో పోరాడుతున్న ఉక్రెయిన్ తన జీడీపీలో 34శాతాన్ని రక్షణకే వెచ్చిస్తోంది. మయన్మార్ వంటి పేద దేశం కూడా తన బడ్జెట్‌లో 29శాతాన్ని రక్షణ కోసం కేటాయించింది. మానవాళిని కాపాడటానికి వాతావరణ మార్పులను అడ్డుకోవాల్సింది పోయి జనహననం కోసం రక్షణపై భారీ వ్యయం చేయడం కేవలం ఆర్థిక సమస్యే కాదు- అది నైతిక, ప్రాణాంతక సమస్య కూడా!ఆయుధోత్పత్తి వల్ల ఎంతమేరకు కర్బన ఉద్గారాలు వెలువడుతున్నాయనే దానిపై వాతావరణ మార్పులపై అంతర్ ప్రభుత్వ సంఘానికీ(ఐపీసీసీకీ) స్పష్టత లేదు. సైనికపరమైన ఉద్గారాలను కూడా అంతర్జాతీయ వాతావరణ మార్పుల మదింపులో చేర్చాలని ఐక్యరాజ్యసమితి, ఐపీసీసీలపై ఒత్తిడి పెరుగుతోంది. సైనిక విస్తరణ వాదానికీ, వాతావరణ మార్పులకూ మధ్యనున్న లంకె కాకతాళీయమైనదేమీ కాదు. అది ఉద్దేశపూర్వకంగా సాగుతున్న అపవిత్ర, విచ్ఛిన్నకర బంధం. ధనిక దేశాలు వర్ధమాన ప్రపంచంలో తగాదాలు పెట్టి, ఆయుధాలు అమ్ముకుంటాయి. ఇల్లు తగలబడుతుంటే చలి కాచుకున్నట్లు యుద్ధాలను రాజేసి సొమ్ము చేసుకుంటాయి. ఇండో-పసిఫిక్‌లో, గాజాలో సాయుధ సంఘర్షణల వెనకా, ఆర్మీనియా-అజర్ బైజాన్ ఘర్షణ నుంచి ఇటీవలి భారత్-పాక్ సంఘర్షణ దాకా ఈ చేదు నిజమే ప్రదర్శితమైంది. దిల్లీ, ఇస్లామాబాద్‌ల మధ్య ఉద్రిక్తతలు ఉన్నాయని తెలిసీ, పాకిస్థాన్‌కు ఎఫ్-16 ఫైటర్ విమానాలను అమ్మడం అమెరికా కుటిల బుద్ధికి నిదర్శనం. సంపన్న పారిశ్రామిక దేశాలు ఇలా కుట్రలు చేయడం, పుల్లలు పెట్టడం యావత్ భూగోళ భవిష్యత్తునే ప్రమాదంలోకి నెడుతోంది.

### సంఘర్షణల్లో లాభాల వేట

మానవ చర్యల మూలంగా వెలువడుతున్న ఉద్గారాల్లో 5.5శాతానికి సైనిక కార్యకలాపాలే కారణం. ఇది పౌర విమానయాన రంగం వెలువరించే ఉద్గారాలకన్నా, జపాన్ ఏడాదికాలంలో విరజిమ్మే కాలుష్యంకన్నా ఎక్కువ. 2022లో ప్రపంచ దేశాల సైన్యాలు 1,221 మిలియన్ మెట్రిక్ టన్నులకు(ఎంఎంటీలకు) సమానమైన కార్బన్ డైఆక్సైడ్‌ను వెదజల్లాయి. 2028కల్లా ఇది 1,822 ఎంఎంటీలకు చేరనుంది. 2023లో ఒక్క గాజా యుద్ధం వల్లే వాతావరణంలోకి 2.81లక్షల టన్నుల కార్బన్ డైఆక్సైడ్ విడుదలైంది. అయినాసరే, అంతర్జాతీయ వాతావరణ మార్పుల నివేదికలో సైనిక ఉద్గారాలను నమోదు చేయలేదు. ఈ ఉద్గారాలకు ప్రధాన రాజ్యాలతోపాటు ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలూ బాధ్యత వహించాలి. భారత్‌తో సాయుధ సంఘర్షణ జరుగుతుండగానే పాకిస్థాన్‌కు అభివృద్ధి పేరిట ఐఎంఎఫ్ రుణం మంజూరు చేయడాన్ని ఇక్కడ గమనించాలి. ఈ నిధులను ఇస్లామాబాద్ ఆయుధ సేకరణకూ, ఉగ్రవాదుల ఎగదోతకూ వెచ్చిస్తుందనేది జగమెరిగిన సత్యం. అమెరికాతోపాటు చైనా కూడా ఆయుధాలు, నిధులు ఇచ్చి పాకిస్థాన్‌ను నిలబెడుతోంది. నిరంకుశపాలనలో మగ్గుతున్న దేశాలకు ఆయుధాలను విక్రయించడం ద్వారా అగ్రరాజ్యాలు విశ్వశాంతిని దెబ్బతీస్తున్నాయి.వలస పాలనలో అడ్డగోలుగా గీసిన సరిహద్దు రేఖలు నేడు వివిధ దేశాల మధ్య ఘర్షణలకు దారితీస్తున్నాయి. జాతి, మతపరమైన విభేదాలూ ఇంటాబయటా సంఘర్షణలను తెచ్చిపెడుతున్నాయి. అమెరికా తదితర దేశాలు అందించే ఆయుధాలే ఈ ఘర్షణల్లో భారీ జనహననానికి కారణమవుతున్నాయి. ప్రపంచమంతటా యుద్ధాలు, సాయుధ సంఘర్షణలు నిరవధికంగా కొనసాగుతూ ఉంటే- ఆయుధాలు అమ్ముకుని లాభపడొచ్చని ప్రధాన దేశాలూ, వాటి ఆయుధ పరిశ్రమలు తహతహలాడుతుంటాయి. భద్రతకు సంబంధించిన వివిధ దేశాల ఆందోళనలు ఆయుధ బేహారులకు అమ్మకాలు పెంచే ముడిసరకులు.

### వర్ధమాన దేశాల బాధ్యత

సంపన్న దేశాలు వాతావరణ మార్పుల నిరోధానికి నిధులివ్వడానికి మొరాయిస్తాయి కానీ, ఆయుధ వ్యాపారానికి మాత్రం అన్నివిధాలా అండదండలిస్తాయి. విపత్తులతో మనుగడ ముప్పును ఎదుర్కొంటున్న 40దేశాలకు ప్రకృతి వైపరీత్యాలను అధిగమించే సాంకేతికతలు, నిధులను ఇవ్వాల్సిందిపోయి ఆయుధాలను విక్రయిస్తున్నారంటే చోద్యం కాక మరేమిటి? వాటికి విత్తనాలు, సౌర ఫలకాల బదులు బుల్లెట్లు, ట్యాంకులను అందించడమేంటి? సంపన్న దేశాల సైన్యాలూ, ఆయుధ పరిశ్రమల కూటమి ప్రపంచాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయి. దీని పెత్తనాన్ని కూలదోసి ప్రపంచ శాంతిని పెంపొందించే వ్యూహాలకూ, విధానాలకూ వర్ధమాన దేశాలు పెద్దపీట వేయాలి. తదనుగుణంగా ఐరాసలో సంస్కరణలు తీసుకురావడానికి అవి సంఘటితంగా కృషి చేయాలి. భారత్ ఈ కృషికి దిగ్దర్శకత్వం వహిస్తోంది. శుద్ధమైన తాగునీరు, హరిత ఇంధనాలు, సుస్థిరాభివృద్ధితోనే ప్రపంచం పదిలంగా ఉంటుంది తప్ప ఆయుధాలు, యుద్ధాలతో కాదని అందరూ గ్రహించాలి. సైనికీకరణకు స్వస్తిచెప్పి, రక్షణ బడ్జెట్లకు కోతపెట్టి, ఆయుధ ఎగుమతులను నియంత్రించడం ద్వారా సైనిక ఉద్గారాలకూ పరిమితి విధించాలి. ప్రజలు, విధానకర్తలు, పర్యావరణ ఉద్యమకారులు ఈ లక్ష్యసాధనకు కలసికట్టుగా కృషి చేయాలి.

# వీరయ్య చౌదరి హత్య తరహాలో.. విస్తుగొలిపే కుట్రకు బ్రేక్!



అమరావతి,అపరిమితమైన అధికారాన్ని దక్కించుకున్న కూటమితమలో తాము కలహించుకుంటున్నారు. ఆదాయానికి అడ్డొస్తే, తరతమ బేధాలు లేకుండా, ప్రాణాలు సైతం తీయడానికి వెనుకాడడం లేదు. ఈ నేపథ్యంలో ఒంగోలులో టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య జరిగింది. అలాగే పల్నాడు జిల్లాలో మరో ఇద్దరిని సొంత పార్టీ నాయకులే అంతమొందించడంపై ప్రభుత్వంలో ఆందోళన నెలకుంది.ఈ నేపథ్యంలో మరో విస్తుగొలిపే కుట్ర బయటపడింది. వీరయ్య చౌదరి తరహాలో అనంతపురం టీడీపీ నాయకుడు సుధాకర్ నాయుడిని సొంత పార్టీ నాయకులే చంపాలని కుట్రపన్నారు. దీన్ని అనంతపురం పోలీసులు భగ్నం చేయడంతో సుధాకర్‌నాయుడికి ఇంకా భూమిపై బతికే అదృష్టం దక్కింది. ఈ వ్యవహారంపై టీడీపీ పెద్దలు సీరియస్ అయ్యారు. వివరాల్లోకి వెళితేసార్వత్రిక ఎన్నికల సమయంలో అనంతపురం అర్బన్ టికెట్‌ను టీడీపీ నాయకుడు సుధాకర్‌నాయుడు ఆశించారు. అయితే ఆయన్ను కాదని ఫార్మా పారిశ్రామికవేత్త దగ్గుపాటి ప్రసాద్‌కు టీడీపీ టికెట్ లభించింది. దగ్గుపాటి గెలుపు కోసం సుధాకర్ నాయుడు గట్టిగా పని చేశారు. అయితే అధికారాన్ని అడ్డు పెట్టుకుని దగ్గుపాటి ప్రసాద్ దందాలకు పాల్పడుతున్నారని, దీంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని సుధాకర్ నాయుడు టీడీపీ పెద్దలకు పలుమార్లు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరాచకాలకు సంబంధించి పెద్ద జాబితాను టీడీపీ పెద్దలకు సుధాకర్ నాయుడు అందించినట్టు సమాచారం. దీంతో సుధాకర్‌నాయుడు, దగ్గుపాటి ప్రసాద్ మధ్య తీవ్ర విభేదాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో సుధాకర్ నాయుడు అనంతపురం ఎస్పీ జగదీష్‌కు ఎమ్మెల్యే, ఆయన అనుచరుల ఆగడాలపై ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. అలాగే తనకు ప్రాణాపాయం ఉన్నట్టు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం.అనంతపురం ఎమ్మెల్యే అనుచరుల పై పోలీసులు నిఘా పెట్టినట్టు తెలిసింది. ఇందులో భాగంగా సుధాకర్ నాయుడిని ఆయన ఇంట్లోనే చంపేందుకు రెక్కీ నిర్వహించడం, అలాగే వాళ్ల కుట్రల్ని పోలీసులు భగ్నం చేశారు. అధికార పార్టీకి చెందిన ఇద్దరు ముఖ్య నాయకుల మధ్య విభేదాలు, చంపే వరకూ దారి తీయడంపై ప్రభుత్వానికి అనంతపురం పోలీస్ అధికారి నివేదిక సమర్పించారని సమాచారం.దీంతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, సుధాకర్‌నాయుడిని విజయవాడకు టీడీపీ పెద్దలు పిలిపించారు. అనంతపురం ఎమ్మెల్యేపై సీరియస్ అయ్యినట్టు తెలిసింది. ఇకపై ఐకమత్యంగా పని చేసుకెళ్లాలని హితవు చెప్పినట్టు తెలిసింది. సుధాకర్ నాయుడిని హత్య చేసేందుకు ఎమ్మెల్యే అనుచరులు కుట్ర పన్నారని తెలిసి, ఆ పార్టీ శ్రేణులు షాక్‌కు గురవుతున్నాయి. పోలీసులు హత్య కుట్రని భగ్నం చేయడంతో సుధాకర్‌నాయుడి ప్రాణాలు నిలిచాయని, లేదంటే మరో వీరయ్య చౌదరికి పట్టిన దుస్థితిని గుర్తు చేసుకోవాల్సి వచ్చేదనే చర్చ విస్తృతంగా సాగుతోంది.

## ఆదర్శంగా తెలంగాణ అభివృద్ధి

కామారెడ్డి,ముఖ్యమంత్రి రేంవత్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ప్రభుత్వం సలహాదారు, మాజీమంత్రి షబ్బీర్ అలీ అన్నారు. తెలంగాన అభివృద్ధి ఇప్పుడు దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పనితీరు దేశానికి ఆదర్శమని, ఇతర రాష్ట్రాల వారు తెలంగాణను ఆధ్యయనం చేస్తున్నారని తెలిపారు.

# బాబు గ్రీన్ సిగ్నల్.. టీడీపీలోకి అవంతి..?

అమరావతి,ఒక్కటేంటే ఒక్క ఘటన రాజకీయ నాయకుల తలరాతలను మార్చేస్తుంది. రాజకీయాల్లో ఒక్కోసారి తప్పు చేసినా చేయకపోయినా రాజకీయ పార్టీల్లో నెగిటివ్ టాక్ వస్తే దాని ప్రభావం పొలిటికల్ కెరీయర్‌పై రిఫ్లెక్ట్ అవుతుంది. అయితే మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ రాజకీయ భవితవ్యం అగమ్యగోచరంలో పడిన సమయంలో ఆయన తీసుకున్న నిర్ణయం కొత్త ఆశలు చిగురింప చేస్తోందంట. టీడీపీలో తిరిగి జాయిన్ అవ్వడానికి దారులు మూసుకుపోయాయి అనుకుంటున్న తరుణంలో ఆయనకు అధిష్టానం డోర్లు తెరవడానికి సిద్దమైందంట.

### నాయకులకు అగ్ని పరీక్ష పెడుతున్న విశాఖ రాజకీయాలు

ప్రస్తుత విశాఖపట్నం జిల్లాలో రాజకీయాలు చేయాలంటే పార్టీలకే కాదు నాయకులకు కూడా అగ్ని పరీక్ష లాగానే కనిపిస్తున్నాయి. ఒక్కో రాజకీయ నాయకుడు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, పదవి పోయిన తర్వాత రాజకీయ మనుగడ కోసంమరో విధంగా వ్యవహరిస్తూ ఉంటారు. రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి సరైన సమయంలో నిర్ణయం తీసుకుని, ముందడుగు వేసే నాయకుడు మాత్రమే విశాఖ రాజకీయాల్లో మనగలడు అనేది ఎంతో మంది రాజకీయ నాయకుల చరిత్ర చూస్తే తెలుస్తుంది.

### పార్టీలు మారినా 15 ఏళ్లు పదవిని కాపాడుకున్న అవంతి

అలా రాజకీయ జీవితం ముగిసిపోయింది అని చర్చ నడుస్తున్న ప్రస్తుత తరుణంలో మళ్లీ తెరమీదకి వచ్చారు మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్. అవంతి శ్రీనివాస్ 2024 ఎన్నికల వరకు ఓటమి తెలియని నాయకుడిగా, 2009 నుంచి ఎన్ని పార్టీలు మారినా 15 ఏళ్లు పదవిని మాత్రం కోల్పోకుండా వచ్చారు. 2009లో భీమిలి నియోజకవర్గం నుంచి పీఆర్పీ ఎమ్మెల్యేగా గెలిచిన అవంతి శ్రీనివాస్ 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి అనకాపల్లి ఎంపీగా విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో రెండోసారి భీమిలి నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పనిచేశారు.

### ఓటమి తర్వాత రాజకీయాలకు దూరం జరిగిన మాజీ మంత్రి

2024 ఎన్నికల్లో వైసీపీ నుండి బరిలో నిలిచి గంటా శ్రీనివాసరావు చేతిలో ఓటమి పాలవ్వడం, వైసీపీ అధికారాన్ని కోల్పోవడం రెండు చకచక జరిగిపోయాయి. వైసీపీ ప్రభుత్వాన్ని కోల్పోయిన కొద్ది కాలానికే మాజీమంత్రి అవంతి శ్రీనివాస్ వైసీపీ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ పదవులన్నింటికీ రాజీనామా చేసి రాజకీయాల నుండి తాత్కాలిక విరామం తీసుకున్నారు. అవంతి శ్రీనివాస్ రాజకీయాలకు దూరమని ప్రకటించడంతో ఆయన గురించి చర్చలు, రాజకీయ విమర్శలు, అవినీతి ఆరోపణలు గాని వినిపించడం ఆగిపోయాయి. బహుశా వైసీపీలో కొనసాగి ఉంటే గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలకు సంబంధించి అవంతిపై కూడా కేసు నమోదు చేసి, అరెస్టుల వరకు దారితీసేదని అయన సన్నిహితులే అంటున్నారంట.

### వ్యాపారాలు చూసుకుంటూ గడిపేసిన అవంతి శ్రీనివాస్

వైసీపీకి రాజీనామా చేసి, రాజకీయాల నుంచి తాత్కాలిక విరామం ప్రకటించిన అవంతి శ్రీనివాస్ కొద్దిరోజుల తర్వాత బీజేపీలో జాయిన్ అవుతారు, టీడీపీ లేదా జనసేన తీర్థం పుచ్చుకుంటారు అనే ప్రచారం జోరుగా సాగింది. రోజులు గడుస్తూ వస్తున్నాయి కానీ అవంతి శ్రీనివాస్ ఏ రాజకీయ పార్టీలోనూ జాయిన్ కాకుండా తన వ్యాపారాలను చూసుకుంటూ రోజులు గడిపేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం పూర్తవుతుంది. గత సంవత్సర కాలంగా సైలెంట్‌గా ఉన్న అవంతి శ్రీనివాస్ మళ్ళీ రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

### త్వరలోనే టీడీపీలో జాయిన్ అవుతారని ఊహగానాలు

మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు రాజకీయ శిష్యుడైన అవంతి త్వరలోనే టీడీపీలో జాయిన్ అవ్వడానికి రంగం సిద్ధం చేసుకున్నారనే ఊహాగానాలు భీమిలి నియోజకవర్గంతో పాటు విశాఖలో చెక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు 25 ఏళ్లుగా.. ఓటమి అంటే తెలియని నాయకుడిగా పేరుపడ్డ మాజీ మంత్రి.. ప్రస్తుత భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు పార్టీలో తగ్గుతున్న ప్రాధాన్యతే.. అవంతి శ్రీనివాస్ టీడీపీ వైపు అడుగులు వేయడానికి కారణమంటున్నారు.

### సాధారణ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న మాజీ మంత్రి గంటా శ్రీనివాస్

గంటా శ్రీనివాస్ ఐదోసారి ఎమ్మెల్యేగా భీమిలి నియోజకవర్గం నుండి గెలిచినా.. ఎలాంటి మంత్రి పదవి ఇవ్వకుండా టీడీపీ అధిష్టానం సాధారణ ఎమ్మెల్యేగానే ఉంచడం.. భీమిలి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గంట శ్రీనివాస్ చేపడుతున్న కొన్ని పనులు.. టీడీపీ అధిష్టానం దృష్టిలో నెగిటివ్‌గా మారుతుండడంతో అవంతి శ్రీనివాస్‌కు.. టీడీపీతో మళ్లీ రాజకీయ ప్రయాణం మొదలు పెట్టడానికి కారణం అయిందంటున్నారు. వైసీపీ అధికారాన్ని కోల్పోయిన వెంటనే అవంతి టీడీపీలో జాయిన్ అవ్వడానికి.. రంగం సిద్ధం చేసుకుంటే గంటా శ్రీనివాస్ అడ్డుకున్నారంట. ప్రస్తుతం టీడీపీలో గంటా శ్రీనివాస్ మాట ప్రస్తుతం చెల్లుబాటు




కావడం లేదు అనే ప్రచారం నేపథ్యంలో.. అవంతి శ్రీనివాస్ సైకిల్ ఎక్కబోతున్నారన్న ప్రచారానికి బలాన్నిస్తుంది.

### విశాఖ మేయర్ కూటమి పార్టీలు అవిశ్వాస తీర్మానం

ఒక్కటి అంటే ఒక్క సంఘటన రాజకీయ నాయకుల తలరాతలను మార్చేస్తుంది. అలా విశాఖ మేయర్ ఎన్నిక అవంతికి కలిసి వచ్చిందంట. రాజకీయాలకు తాత్కాలిక విరామం ప్రకటించిన అవంతి శ్రీనివాస్ టీడీపీలో జాయిన్ అవ్వడానికి.. ఎన్నో విధాలుగా ట్రై చేసినా అవకాశం దక్కకపోవడంతో.. వ్యాపారాలు చూసుకుంటూ బిజీగా గడిపేస్తున్న టైంలో.. విశాఖ మేయర్‌పై కూటమి పార్టీలు అవిశ్వాస తీర్మానం పెట్టాయి. అప్పుడు అవంతి శ్రీనివాస్ కూతురు ఆరవ డివిజన్ కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక పార్టీ మారి టీడీపీకి అనుకూలంగా ఓటు వేయడంతో.. అవిశ్వాసం నెగ్గిన టీడీపీ మేయర్ పదవి కైవసం చేసుకోగలిగింది. ఆ క్రమంలో అవంతి కుటుంబంపై టీడీపీ అధిష్టానానికి నెగిటివ్ ఒపీనియన్ పోయిందంట.

### టీడీపీకి అనుకూలంగా ఓటు వేసిన అవంతి కుమార్తె ప్రియాంక

కీలకమైన సమయంలో టీడీపీకి అండగా నిలిచి ఆయన కూతురు లక్ష్మీ ప్రియాంక.. చేసిన సహాయం అవంతి శ్రీనివాస్ టీడీపీలో జాయిన్ అవ్వడానికి దారి చూపించిందని ప్రచారం జరుగుతోంది. అవిశ్వాస తీర్మానం సమయంలో తన కూతురుతో పగడ్బందీగా ప్లాన్ చేసి.. టీడీపీకి అండగా నిలిచిన అవంతి శ్రీనివాస్.. ఫ్యామిలీ టీడీపీలో ఎంట్రీకి లైన్ క్లియర్ చేసుకుందన్న టాక్ వినిపిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీడీపీలో జాయిన్ అవ్వడానికి అవంతి శ్రీనివాస్.. ఇంట్రెస్ట్ చూపించిన సమయంలో దూరం పెట్టిన టీడీపీనే.. ఇప్పుడు ఆయనకు మార్గం సుగమం చేసిందంటున్నారు.

### తన కొడుకు రవితేజను బరిలో దించడానికి ప్రయత్నించిన గంటా

2029 ఎన్నికల సమయానికి నియోజకవర్గాల పునర్విభజన జరిగి.. నియోజకవర్గాల సంఖ్య పెరిగితే భీమిలి నియోజకవర్గం కచ్చితంగా.. రెండు నియోజకవర్గాలుగా మారిపోతుంది. ఒకే సామాజిక వర్గానికి చెందిన నాయకులుగా గంటా, అవంతి ఉన్న రానున్న నాలుగేళ్లు పార్టీలోనూ, నియోజకవర్గాల్లోనూ ప్రజలకు ఎంతవరకు అందుబాటులో ఉంటారు అనే దానిబట్టే భవిష్యత్తును నిర్ణయించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా 2024 ఎన్నికల్లోనే మాజీ మంత్రి గంటా శ్రీనివాస్ ప్రత్యక్ష రాజకీయాల్లో నుండి తప్పుకుని తన కొడుకు గంటా రవితేజను భీమిలి నియోజకవర్గం నుండి బరిలోకి దించాలని ప్రయత్నం చేసినట్లు ప్రచారం జరిగింది.

### భీమిలిలో సంబరపడిపోతున్న అవంతి వర్గం

అప్పట్లో చంద్రబాబు ఈసారి ఎన్నికల్లో గంటానే బరిలో ఉండాలని సూచించడంతో ఆయన వారసుడి పొలిటికల్ ఎంట్రీకి బ్రేక్ పడింది. అయితే భీమిలి ఎమ్మెల్యేగా గెలిచిన రోజు నుండి నియోజకవర్గ కార్యకలాపాలన్నీ గంటా శ్రీనివాస్ కాకుండా అతని కొడుకు గంటా రవితేజ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ నియోజకవర్గంలో పట్టు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో గంటా శ్రీనివాస్ బరిలో ఉండే అవకాశం లేకపోవడం, నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశం ఉండడం.. నియోజకవర్గాలు పెరిగితే రాజకీయంగా మాత్రమే కాకుండా ఆర్థికంగా కూడా బలవంతుడైన అవంతి శ్రీనివాస్‌కు అవకాశం ఇచ్చే పరిస్థితులు ఉంటాయి కాబట్టి.. నాలుగేళ్ల ముందే అవంతిని టిడిపిలో జాయిన్ చేసుకోవడానికి టీడీపీ అధిష్టానం గ్రీన్ సిగ్నెల్ ఇచ్చిందంటున్నారు.

### గంటా శ్రీనివాస్ అధిపత్యాన్ని తగ్గించడానికా?

విశాఖ మేయర్ ఎన్నికల్లో కూతురు ద్వారా అవంతి శ్రీనివాస్ నడిపిన మంత్రాంగం ఫలించడంతో ఆయన రీఎంట్రీ ఇవ్వడానికి అవకాశం దొరికిందని నియోజకవర్గంలో అయన అనుచరగణం సంబరపడిపోతోంది. గంటా శ్రీనివాసుకు రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న అవంతి శ్రీనివాస్‌ను టిడిపిలోకి తీసుకు రావడం వెనక గంటా శ్రీనివాస్ ఆధిపత్యాన్ని తగ్గించడమే టీడీపీ పెద్దల వ్యూహంగా కనిపిస్తోంది. మరి అవంతి విషయంలో గంటా ఎలాంటి రాజకీయం చేస్తారో? ఒకే గూటికి చేరితే ఆ రాజకీయ గురుశిష్యుల ప్రయాణం ఎలా ఉంటుందో చూడాలి.

# భారత్‌తో సంబంధాలు పునరుద్ధరించాలి

న్యూఢిల్లీ,గతంలో ట్రుడో ప్రభుత్వ హయంలో భారత్‌తో సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో వాటిని చక్కదిద్దుకునే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. భారత్‌ను టార్గెట్ చేస్తున్న వేర్పాటువాద శక్తులతో సంబంధాలు తెంచుకోవాలని కెనడా మాజీ ప్రధాని స్టీఫెన్ హార్పర్ ఆ దేశంలోని రాజకీయ పార్టీలకు సూచించారు. భారత్‌ను విభజించాలని చూసే అరాచక శక్తులకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని రాజకీయ పార్టీలకు సూచించారు. కెనడాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనుకునే ఏ పార్టీ అయినా భారత్‌తో సమస్యలు సృష్టించిన వేర్పాటువాదులతో సంబంధాలు తెంచుకోకపోతే న్యూదిల్లీతో.. కెనడా ఎప్పటికీ స్నేహపూర్వక మైన, బలమైన సంబంధాలను కొనసాగించలేదన్నారు. వేర్పాటువాదులతో సంబంధాలు తెంచుకోవడానికి ఇప్పటివరకు వివిధ రాజకీయ పార్టీలు ఎందుకు ఆలస్యం చేశాయో తనకు తెలియదని హార్పర్ అన్నారు. తన పదవీకాలంలో ఇటువంటి విషయాలకు దూరంగా ఉన్నామని.. ప్రస్తుత రాజకీయ పార్టీలు కూడా అదే విధానాన్ని పాటిస్తాయని తాను భావిస్తున్నానని తెలిపారు. ఎన్నోఏళ్లుగా కెనడాకు మిత్ర దేశంగా ఉన్న భారత్‌తో తిరిగి బలమైన సంబంధాలు ఏర్పరుచుకోవాలంటే ఇప్పటివరకు కెనడాకు, భారత్‌కు ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని, జిహాదీలు, యాంటీ-సెమిట్‌లు, ఖలిస్థానీలు వంటి విభజన సమూహాలను ప్రోత్సహించడం ఆపాలన్నారు. ఇవి మాత్రమే ఇరుదేశాల మధ్య ఉన్న సమస్యలకు పరిష్కారమని పేర్కొన్నారు. కన్జర్వేటివ్ పార్టీ నాయకుడు హార్పర్ 2006 నుంచి 2015 వరకు కెనడా ప్రధానమంత్రిగా ఉన్నారు. 1985 జూన్ 23న ఖలిస్థానీ ఉగ్రవాదులు ఎయిర్ ఇండియా విమానం కనిష్కపై బాంబు దాడి చేసిన ఘటనపై ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో ఒక విచారణ కమిషన్‌ను ఏర్పాటుచేశారు. రి-టైర్డ్ జస్టిస్ జాన్ మేజర్ నేతృత్వంలోని ఆ కమిషన్ జులై 16, 2010న తన నివేదికను సమర్పించింది. ఈ దాడికి దారితీసిన వైఫల్యాలకు తమ ప్రభుత్వం తరఫున అప్పట్లోనే భారత్‌కు క్షమాపణలు తెలిపారు. దశాబ్దాలతరబడి మిత్ర దేశాలుగా ఉన్న భారత్, కెనడాల మధ్య గత కొంతకాలంగా సంబంధాలు దెబ్బతిన్నాయి. ట్రూడో అధికారంలో ఉన్న సమయంలో ఖలిస్థానీ ఉగ్రవాది హార్‌దీప్‌సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ హస్తం ఉందంటూ ఆయన ఆరోపించడంతో.. భారత్, కెనడాల మధ్య ఉద్రిక్తతలు చెలరేగాయి. అనంతరం కెనడా ఎన్నికల్లో జోక్యం చేసుకోవడానికి భారత్ యత్నిస్తోందంటూ కెనడియన్ సెక్యూరిటీ- ఇంటెలిజెన్స్ సర్వీసు డిప్యూటీ డైరెక్టర్ సంచలన ప్రకటన చేశారు. దీంతో ఇరుదేశాల మధ్య దూరం మరింత పెరిగింది. కెనడా ప్రధానిగా ఉన్న మార్క్ కార్నీ ఎన్నికయిన తర్వాత ఆయన మాట్లాడుతూ.. భారత్‌తో సంబంధాలు పునరుద్ధరించుకోవడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పుడు మాజీ ప్రధాని వ్యాఖ్యలు కూడా తోడవ్వంతో సంబంధాల పునరుద్ధరణలో అడుగు పడ్డట్లుగానే భావిస్తున్నారు.

## ప్రతి నిముషం దాడులపై ఆరా తీసారు

న్యూఢిల్లీ,పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సందర్భంలో ఆ రోజు రాత్రి ప్రధాని మోడీ నిముషనిముషానికి వివరాలు తెలుసుకుంటూ గడిపారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ వెల్లడించారు. అర్థరాత్రి సమయంలో చేపట్టిన ఈ ఆపరేషన్‌ను ప్రధాని మోదీ ఎలా పర్యవేక్షించారనే విషయాన్ని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తాజాగా వెల్లడించారు. ఇండియన్ ఆర్మీ మే 7వ తేదీ రాత్రి పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ సంస్థలను ధ్వంసం చేసిందని తెలిపారు. ఆ సమయంలో ప్రధాని మోదీ ప్రతి నిమిషం.. ఎక్కడ ఏం జరిగింది. ఎలా జరిగిందనే విషయాలను పర్యవేక్షించారని చెప్పారు. ఈ ఆపరేషన్ సమయంలో ప్రధాని ఎటువంటి ఒత్తిడికి లోను కాలేదని మంత్రి స్పష్టం చేశారు. సాధారణంగానే ప్రధాని మోదీ.. ఎక్కువగా రాత్రి సమయాల్లోనే పని చేస్తుంటారని చెప్పుకొచ్చారు. అలాగే ఈ ఆపరేషన్ సిందూర్‌ను సైతం ఆయన రాత్రి సమయంలో పర్యవేక్షించారని తెలిపారు. బుధవారం న్యూఢిల్లీలో మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాన మంత్రి కార్యాలయం సహాయ మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. రక్షణ బలగాలకు ప్రధాని మోదీ పూర్తి స్వేచ్ఛను ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో ఆయా బలగాలకు ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే దానిపై ఒక స్పష్టత ఏర్పడిందన్నారు. అయితే ఈ తరహా నిర్ణయం గతంలో ఎన్నడూ తీసుకోలేదని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ గుర్తు చేశారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాదులు, ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడంలో.. ప్రధాని మోదీ పక్కా స్పష్టతతో ఉన్నారన్నారు. అంతేకాకుండా.. ఈ దాడుల సమయంలో పౌరులకు ఎటు-వంటి హానీ జరగకూడదన్నది ఆయన ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఇక పాకిస్థాన్ అణుబాంబుల పేరుతో భయపెట్టే ప్రయత్నం చేసినా.. ప్రధాని భయపడలేదన్నారు మంత్రి జితేంద్ర సింగ్. ప్రధాని మోదీ వ్యక్తిగతంగా కానీ.. దేశ భద్రత పరంగా కానీ.. ఎలాంటి భయాందోళనకు గురికాలేదన్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఖచ్చితమైన టార్గెట్‌తో.. సంయమనంతో చేసిందని స్పష్టం చేశారు. ఈ దాడులు కేవలం ఉగ్రవాద స్థావరాలు, వాటి మౌలిక సదుపాయాలే లక్ష్యంగా చేసుకుందే కానీ.. పౌరులు, ఆ దేశ సైనికులను టార్గెట్‌గా చేసుకోలేదని గుర్తు చేశారు. భారత దేశ పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో పాకిస్థాన్ డ్రోనులు, క్షిపణులతో దాడి చేసి.. పౌరులతోపాటు- సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుందని వివరించారు. దీంతో భారత్ ప్రతీకార చర్యలకు దిగిందని.. పాకిస్థాన్‌లోని కీలకమైన సైనిక స్థావరాలపై దాడి చేసి ధ్వంసం చేసిందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు.

## మంచి ఆలోచనలే శ్రీరామరక్ష

తిరుమల, (ఆధ్యాత్మికం)చెడు వ్యసనాలు వదిలి నిర్మల మనస్సుతో ఉన్నంత కాలం మనలను ఏ మలినం ఆవరించదు. ఓ రకంగా నిర్మలమైన మనస్సు ఆరోగ్యానికి హేతువు.మన మనస్సు చేసే మంచి ఆలోచనలతోనే మన దేహం కూడా అదుపులో ఉంటుంది. ఆరోగ్యంగా ఉంటుంది. చెడు ఆలోచనలను మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. ఇకపోతే ఇది సత్యం. సత్యం కఠినంగానే ఉంటుంది. మనిషి సత్యవచస్సులోని ఆంతర్యాన్ని తెలుసుకొని ఆచరిస్తే, ఆ కఠినవచస్సు అమృతమయం అవుతుంది. అనేక వ్యసనాలకు మనిషి బానిస అవుతాడు. అలాంటివాడికి వ్యసనాలను మానుకొమ్మని చెప్పే మాటలు రుచించవు. నిప్పుల్లోకి దూకే మిడతకు ఆ నిప్పు కాల్చివేస్తుందనే సత్యం తెలియదు. అలాగే వ్యసనాలకు లోనైన మనిషికి వాటి పర్యవసానం ఎలా ఉంటుందో తెలియదు. వ్యసనపరుడికి తాత్కాలికంగా లభించే ఆనందం, సుఖమే నచ్చుతాయి. అందుకే వ్యసనపరులు వ్యసనపరులతోనే సహవాసం చేస్తారు. మంచివాళ్లు చెప్పే మాటలు వారి చెవులకు శూలాల్లా గుచ్చుకొంటాయి. గాడిదకు గంధం వాసన తెలియనట్లు, పందికి పరమాన్నపు రుచి తెలియనట్లే- వ్యసనపరుడికి హితవచన మహిమ తెలియదు. మనిషి బాగుపడాలంటే పెద్దలపట్ల భయమైనా ఉండాలి, లేదా మంచి విషయాలపై భక్తి అయినా ఉండాలి. భయం కాని, భక్తి కాని లేని మనిషి తెగిన గాలిపటంలా ఎక్కడ పతనమవుతాడో ఎవరికీ తెలియదు. చేతులు కాలాక ఆకులు పట్టుకొన్న చందంగా, మనిషి అధోగతిపాలైన తరవాత జ్ఞానోదయమైనా- చేయగలిగిందేమీ

## తొక్కిసలాట ఘనటపై పోలీసుల కేసు నమోదు

బెంగళూరు: ఆర్సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11మంది మృతి చెందిన ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనపై సమాచార హక్కు కార్యకర్త స్నేహమయి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై కబ్బన్ పార్క్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆర్సీబీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డీఎన్ఏ ఎంటర్–టైన్‌మెంట్ నెట్‌వర్క్స్, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ సహా తొక్కిసలాటతో సంబంధం ఉన్న పలువురిపై కేసు నమోదు చేసినట్లు– పోలీసులు వెల్లడించారు. నేరపూరిత నిర్లక్ష్యం కేసులో ఈ సంస్థలను నిందితులుగా పేర్కొని ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. మరోవైపు, ఈ కేసు దర్యాప్తును సీఐడీకి బదిలీ చేస్తున్నట్లు కర్ణాటక ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు కోర్టుకు ఇచ్చిన స్టేటస్ రిపోర్టులో ఈ విషయాన్ని ప్రభుత్వం పేర్కొంది. సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ఈ కేసును దర్యాప్తు చేస్తుందని తెలిపింది. తదుపరి దర్యాప్తు కోసం సిట్‌ను ఏర్పాటు– చేయాలన్న ఆదేశాలతో పాటు ఎఫ్ఐఆర్ కాపీని సీఐడీకి అప్పగించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఈ విషాద ఘటనపై మెజిస్టీరియల్ విచారణ జరుపుతున్నట్లు– ప్రభుత్వం ప్రకటించింది. తొక్కిసలాటకు కారణాలేంటి? తలెత్తిన లోపాలు, జవాబుదారీతనం వంటి అంశాలను పరిశీలించేందుకు డిప్యూటీ– కమిషనర్, బెంగళూరు డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ 15 రోజుల్లోగా విచారణ చేస్తారని ప్రభుత్వం తెలిపింది. స్టేడియం వద్ద 2.5లక్షల మంది ప్రజలు గుమిగూడారని, బెంగళూరు నగర పోలీసుల నుంచి 1380 మంది సిబ్బంది, 13 కేఎస్ఆర్పీ ప్లాటూన్లు ని మోహరించి విస్తృత ఏర్పాట్లు– చేసినట్లు– ప్రభుత్వం తన నివేదికలో పేర్కొంది. కానీ, జనం భారీగా తరలిరావడంతో పలు గేట్ల వద్ద తొక్కిసలాట జరిగి 11మంది మృతిచెందగా.. 56మంది గాయపడ్డారని తెలిపింది. క్షతగాత్రుల్లో 50మంది అవుట్ పేషెంట్లుగా చికిత్స పొందగా, మరో ఆరుగురికి ఇంకా చికిత్స కొనసాగుతున్నట్లు– పేర్కొంది. స్టేడియం వద్ద పోలీస్ సిబ్బందితో పాటు– మూడు అగ్నిమాపక వాహనాలు, రెండు అంబులెన్స్‌లు, రెండు డి–శ్వాట్ యూనిట్లు–, ఒక నీటి ట్యాంకర్, కమాండ్ కంట్రోల్ వాహనం మోహరించినట్లు ప్రభుత్వం తెలిపింది. మృతుల కుటు–ంబాలకు రూ.10లక్షల చొప్పున పరిహారం ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం క్షతగాత్రులకు వైద్య ఖర్చులన్నింటినీ భరించినట్లు తెలిపింది. అలాగే, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ సైతం మృతులకు రూ.5లక్షలు చొప్పున పరిహారం ఇస్తామని హామీ ఇచ్చింది.

## బీచ్ టూరిజం అభివృద్ధికి కృషి...

మచిలీపట్నం, ఏపీలో బీచ్ టూరిజం అభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. మసూల బీచ్ ఫెస్టివల్ ద్వారా తొలి అడుగు వేశామని తెలిపారు. మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో ఇంత పెద్ద బీచ్ ఫెస్ట్ నిర్వహించడం గర్వంగా ఉందని తెలిపారు. దక్షిణ భారత దేశంలోనే మసూల బీచ్ ఫెస్ట్ అతి పెద్దదని అన్నారు. మసూల బీచ్ ఫెస్టివల్‌ని మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్ర పర్యాటకశాఖమంత్రి కందుల దుర్గేశ్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీచ్ ఫెస్ట్... పర్యాటకులు, జిల్లావాసులకు వినోదం, ఆహ్లాదం, అన్ని రాష్ట్రాల రుచులను అందించనుంది. విద్యా, సాంస్కృతిక కేంద్రంగా.. స్వాతంత్య్ర, రాజకీయ చైతన్యానికి కేంద్ర బిందువుగా నిలిచిన మచిలీపట్నం చరిత్రను గుర్తు చేసేలా మంగినపూడిలో నాలుగు రోజులు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నెల 5 నుంచి 8 వరకు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు, జాతీయ స్థాయిలో సి–కయాకింగ్, కనోయింగ్ బీచ్ కబడ్డీ, వాలీబాల్ పోటీ–లు నిర్వహిస్తున్నారు. 80 అడుగుల అమరావతి ఐకానిక్ టవర్, 100 అడుగుల ఎత్తులో జాతీయ పతాకం శాశ్వత నిర్మాణాలుగా ఏర్పాటు– చేశారు. కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. టూరిజం అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా అడుగులు వేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర ఉద్ఘాటించారు. 2018లో మసూల బీచ్ ఫెస్టివల్ అత్యంత ఘనంగా నిర్వహించామని.. కానీ గత వైసీపీ పాలకులు నాశనం చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీచ్‌లోకి రావడానికి కూడా లేకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. గేట్ వే ఆఫ్ అమరావతిగా బందరును మార్చేందుకు ఈ ఫెస్ట్ ద్వారా అడుగులు వేశామని చెప్పారు. అమరావతిలోని అసెంబ్లీ నమూనాను ఫెస్టివల్‌కి వచ్చేవారికి కనువిందు చేసేలా ఏర్పాటు– చేశామని వెల్లడించారు. పింగళి వెంకయ్యాని స్మరించుకుంటూ.. అతి పెద్ద జాతీయ జెండా ఏర్పాటు– చేసుకున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నాలుగు రోజుల పాటు– జరిగే పండుగలో అడ్వెంచర్ స్పోర్ట్స్, పారా ÷–లగైడింగ్, బీచ్ కబడ్డీ, బీచ్ వాలీబాల్‌తో సహా చాలా ఏర్పాట్లు– చేశామని అన్నారు. దేశంలోని అన్ని రుచులు ఒకే చోట అందించబోతున్నామని చెప్పుకొచ్చారు. స్వదేశీ దర్శన్ కింద నిధులు తీసుకొచ్చి టూరిజం అభివృద్ధికి అధికారులు సహకారం అందించాలని కోరారు. హోటల్స్, రిసార్ట్ ఏర్పాటు– చేసేందుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. బందరు పోర్టుని పూర్తి చేసి బందరు భవిష్యత్తుని మారుద్దామని పిలుపునిచ్చారు. ఈ వేడుకలకు విచ్చేసిన వారికి మన ఆతిథ్యం ఎలా ఉంటు–ందో చూపిద్దామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగినిపూడి బీచ్‌లో గురువారం నుంచి నాలుగురోలపాటు– మసూల బీచ్ ఫెస్టివల్ జరుగనుంది. జాతీయ జెండా ఆవిష్కరణ, క్రీడాకారులతో మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేశ్ భారీ ర్యాలీ నిర్వహించారు. బీచ్ ఫెస్టివల్‌లో బీచ్ కబడ్డీ, బీచ్ వాలీబాల్, కయాకింగ్ వంటి పోటీలు నిర్వహించనున్నారు. బీచ్ ఫెస్టివల్ సందర్భంగా 80 అడుగుల అమరావతి ముఖద్వారం, పర్యాటకులని ఆకర్షిస్తూ పలు రకాల స్టాల్స్ ఏర్పాటు– చేశారు. బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లను మచిలీపట్నం వాసులు, టూరిస్టులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. బీచ్ ఫెస్టివల్‌లో ప్రత్యేక ఆకర్షణగా హెలీరైడ్, పారాగ్లేడింగ్, స్పీడ్ బోటింగ్ ఏర్పాటు– చేశారు. బీచ్ ఫెస్టివల్‌లో 22 రాష్ట్రాల నుంచి 4000 మంది క్రీడాకారులు పాల్గొనున్నారు. బీచ్ ఫెస్టివల్‌తో మచిలీపట్నం, చిలకలపూడి బీచ్‌లో సందడి వాతావరణం నెలకొంది.

## నెల్లూరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నెల్లూరు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఆత్మకూరు మండలంలో రోడ్డు ప్రమాదంలో చోటుచేసుకుంది. ఎఎస్ పేట గ్రామ శివారులో ఆటోను కారు ఢీకొట్టడంతో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతులు వెంకటరావుపల్లి గ్రామానికి చెందిన కూలీలుగా గుర్తించారు. తెల్లపాడులో పొగాకు గ్రేడింగ్ కోసం కూలీలు ఆటోలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనాలను క్రేన్ సహాయంతో పక్కకు తొలగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ రోడ్డు ప్రమాదంపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగ్రాతులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

# తేలని చర్చలు.. తీరని ఉద్రిక్తతలు

సెంట్రల్ డెస్క్:ఉక్రెయిన్ రష్యా మధ్య శాంతి చర్చలకు ఒకవంక ప్రయత్నాలు జరుగుతుండగా, మరోవంక పరస్పరం దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. టర్కీ మధ్యవర్తిత్వంలో రెండోసారి రెండు దేశాల ప్రతినిధుల మధ్య శాంతి చర్చలు జరిగినా గంటలోనే ఎటూ తేలకుండా ముగిసిపోయాయి. కాల్పుల విరమణ ప్రసక్తి లేకుండా యుద్ధఖైదీల మార్పిడిపై మాత్రం ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ చర్చలకు 24 గంటల ముందు రష్యాపై ఉక్రెయిన్ ప్రయోగించిన వందలాది డ్రోన్లు ఆదివారం రష్యా సైనిక స్థావరాలు అయిదింటిలో భారీ విధ్వంసం సృష్టించాయి.అంతకు ముందు రష్యా రెండుసార్లు ఉక్రెయిన్‌పై బాంబుల వర్షం కురిపించింది. రానురాను ఈ పరస్పర దాడుల పరిణామాలు ఎంతవరకు సాగుతాయో చెప్పలేం. రోజురోజుకూ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీకి మొదటినుంచి అండదండలుగా నిలుస్తున్న ఐరోపా దేశాలు రష్యా దూకుడుపై ఆగ్రహంతో ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎంత నచ్చచెప్పినా రష్యా అధ్యక్షుడు పుతిన్ దురాక్రమణలను, దాడులను ఆపడంలేదని వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌కు భారీ సంఖ్యలో డ్రోన్‌లను సరఫరా చేయడానికి బ్రిటన్ సిద్ధమవుతోంది. 2026 ఏప్రిల్ నాటికి ఉక్రెయిన్‌కు లక్ష డ్రోన్లు అందజేస్తామని బ్రిటన్ హామీ ఇచ్చింది. ఆ దేశానికి ఇచ్చే 4.5 బిలియన్ పౌండ్ల మిలిటరీ మద్దతులో ఈ 350 మిలియన్ పౌండ్ల డ్రోన్ ప్యాకేజీ భాగమని పేర్కొంది.ఉక్రెయిన్ డ్రోన్లు రష్యాలోని 41 బాంబర్ విమానాలను ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. 2022 డిసెంబర్‌లో రష్యా భూభాగంలో ఉక్రెయిన్ తొలిసారి దాడులు మొదలు పెట్టింది. గత మూడేళ్లుగా డ్రోన్ల వినియోగంలో తన సామర్థ్యాన్ని ఉక్రెయిన్ మెరుగుపర్చుకుంది. ఉక్రెయిన్ డ్రోన్ల దాడి జరుగుతుందని, అపార నష్టం సంభవిస్తుందని రష్యా ఊహించలేదు. ఈ దాడుల్లో రష్యా టియు 95, టియు 120 విమానాలు విధ్వంసం అయ్యాయి. వీటిని రష్యా తిరిగి సమకూర్చుకోవాలంటే వేలాది కోట్ల రూబుళ్లు ఖర్చు పెట్టవలసి వస్తుందని నిపుణులు అంచనాగా చెబుతున్నారు. రష్యా దాడులవల్ల గత మూడేళ్లలో ఉక్రెయిన్ వేలాది మంది సైన్యాన్ని కోల్పోయినప్పటికీ పాశ్చాత్య దేశాల మద్దతుతో ఉక్రెయిన్ నిలబడగలుగుతోంది. నల్లసముద్రంలో రష్యా రణతంత్ర వ్యూహాలను ఛేదించడానికి డ్రోన్‌ల వినియోగంపైనే ఉక్రెయిన్ ఆధారపడుతోంది.రష్యా అధ్యక్షుడు పుతిన్ దృష్టిలో జెలెన్స్కీ పిపీలికం. ఎలాగైనా జెలెన్స్కీని పాదాక్రాంతం చేసుకోవాలన్న కక్ష పుతిన్‌లో పోవడం లేదు. అందుకే కాల్పుల విరమణకు జెలెన్స్కీ అంగీకరించినా పుతిన్ ఒప్పుకోవడం లేదు. కాల్పులు విరమణ కావాలంటే అనేక షరతులను పుతిన్‌ముందుకు తీసుకు వస్తున్నారు. ఉక్రెయిన్‌లో తాము ఆక్రమించుకున్న భూభాగాలను విడిచిపెట్టాలని, నాటో కూటమిలో ఉక్రెయిన్ సభ్యత్వం పొందరాదని, భవిష్యత్తులో యుద్ధానికి సిద్ధపడబోమని లిఖితపూర్వక హామీ ఇవ్వాలని పుతిన్ ఆంక్షలు విధిస్తున్నారు. అసలు ప్రత్యక్షంగా తమతో చర్చలకు జెలెన్స్కీ సరిపోడని పుతిన్ అభిప్రాయం. రెండు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమై 40 నెలలు గడుస్తోంది.రెండు దేశాల మధ్య విసుగు, అలసట ఛాయలు కనిపిస్తున్నాయి. ఉక్రెయిన్ యుద్ధ భూమిలో అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. రష్యాతో పోలిస్తే ఉక్రెయిన్‌కు ఆయుధాల కొరత తీవ్రంగా ఉంది. ముఖ్యంగా గగనతల రక్షణ వ్యవస్థ లేకపోవడంతో రష్యా క్షిపణులు, డ్రోన్ల దాడులను తట్టుకోలేకపోతోంది. అందుకనే వినూత్నమైన డ్రోన్ దాడులను నిర్వహించడం ద్వారా తన దుర్బలత్వాలను భర్తీ చేయడానికి ప్రయత్నిస్తోంది. ఉక్రెయిన్ తన



ఖేర్సన్ సిటీని కోల్పోయిన తరువాత తాను కోల్పోయిన భూభాగాల్లో 2022 నుంచి ఎలాంటి విజయాలను సాధించలేదు. గత ఏడాదిగా 5000 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని ఉక్రెయిన్ రష్యా వల్ల కోల్పోయింది. ఉక్రెయిన్ ముట్టడించిన కుర్స్‌ను రష్యా తిరిగి స్వాధీనం చేసుకోగలిగింది. రష్యా స్ప్రింగ్ (వసంత) దాడి ఇప్పుడు ఊపందుకోంది.సుమీ రీజియన్‌లో భూభాగాలను ఆక్రమించుకుంటోంది. ఉక్రెయిన్ వారాంతపు రష్యా వైమానిక దాడులతో చుట్టుకుపోతోంది. దీనికితోడు సైనిక బలగాల తీవ్ర కొరత, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నేతృత్వంలో మద్దతు కొనసాగడంలో అనిశ్చితి ఇవన్నీ ఉక్రెయిన్‌కు తీరని ప్రతిబంధకాలుగా వెంటాడుతున్నాయి. మరోవంక రష్యాకు కూడా తమ ఇంధన వనరులపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులను నివారించడం కష్టంగా కనిపిస్తోంది. అలాగే నల్లసముద్రంలోని రష్యా దళాలపై ఉక్రెయిన్ దాడులు కొనసాగుతున్నాయి. ఇప్పుడు వైమానిక స్థావరాలపై ఉక్రెయిన్ దాడులు చేయడం రష్యాకు కలవరం కలిగిస్తోంది. రష్యా యుద్ధ రంగంలో ఏమాత్రం దూకుడు పెంచినా ఉక్రెయిన్‌నుంచి ఎదురుదాడి తప్పదు.ఇదే విధంగా యుద్ధం కొనసాగితే రెండు వైపులా అపార నష్టం తప్పదు. ట్రంప్ చొరవతో ప్రారంభమైన శాంతి చర్చలు కొద్దిపాటి పురోగతిని అందించాయి. ఈ సమయంలో ట్రంప్ తప్పుకోకూడదు. రష్యాకు చాలా కాలంగా ఫిర్యాదులు ఉన్నాయి. భవిష్యత్తు భద్రతా సమస్యలున్నాయి. ఇవన్నీ పరిష్కరించవలసి ఉంది. అయితే భవిష్యత్తులో తమపై దాడులు జరగకుండా ఉండేందుకు విశ్వసనీయమైన భద్రతా గ్యారంటీలను రష్యా నుంచి ఉక్రెయిన్ ఆకాంక్షిస్తోంది. ఈ విభేదాలను పరిష్కరించడంలోను, కాల్పుల విరమణ ఒప్పందం ఉభయ దేశాల మధ్య కుదర్చడం లోనూ కీలక సూత్రధారి అమెరికా ప్రభుత్వమే. ఇస్తాంబుల్‌లో రెండు దేశాల మధ్య రెండో విడత చర్చలు విఫలమైన నేపథ్యంలో కనీసం ఈ నెలాఖరులోగా రెండు దేశాల అధ్యక్షులు ప్రత్యక్షంగా చర్చలు జరిపితేనే పరిష్కారం లభిస్తుందని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ చేసిన ప్రతిపాదన సమంజసమే అనిపిస్తోంది.

## పర్యావరణహితంగా హైదరాబాద్

హైదరాబాద్,హైదరాబాద్ నగరం విశ్వనగరంగా మారాలన్న తపనతో సిఎంరేవంత్ అనేక చర్యలు తీసుకుంటున్నారని ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మూసీ సుందరీకరణ ఇందులో భాగమేనని అన్నారు. హైదరాబాద్ ఖ్యాతిని పెంచడంతో పాటు, అందమైన నగరంగా తీర్చిదిద్దడం కూడా తమ లక్ష్యంగా ఉందని అన్నారు. ప్రపంచపర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ, నగర పరిశుభ్రతకు ప్రజలుకూడా తోడ్పాటును ఇవ్వాలన్నారు.

# నీతి ఆయోగ్ చర్చల ప్రభావం ఎంత?



న్యూఢిల్లీ, ప్రధానమంత్రి మోడీ సమక్షంలో... ఇటీవల జరిగిన నీతి ఆయోగ్ భేటీలో పలు అంశాలపై చర్చ జరగడం అటుంచితే..పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు కాలేదు. తెలుగు రాష్ట్రాలకు చెందిన సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు హాజరై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చక్కగా ఇచ్చారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల సంక్షేమం అన్నది ఉమ్మడిగా నిర్ణయించి ముందుకు సాగాల్సి ఉంది. పార్లమెంటులో సమస్యలపై చర్చించడం లేదు. నీతి ఆయోగ్‌లోనూ ప్రధాని ప్రసంగానికే పెద్దపీట వేస్తున్నారు. హాజరైన సిఎంలు ప్రస్తావించిన అంశాలపై చర్చించడం లేదా, తదుపరి చర్యలు కానరావడం లేదు. మొత్తంగా దేశంలో కేంద్రంలో ఏ పార్టీ అధికారం లో ఉన్నా సమావేశాలు, చర్చలు అన్నవి తూతూ మంత్రంగా సాగుతున్నాయి. సమావేశాలు, చర్చలు అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రజల ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా సాగుతున్నాయి. అనేక సందర్భాల్లో నీతి ఆయోగ్ సమావేశాల్లో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు వివిధ సమస్యలపై నేరుగానే ప్రశ్నించారు. ఆయా రాష్ట్రాల సమస్యలను దేశం దృష్టికి తీసుకెళ్లారు. అయినా లాభం లేకపోవడంతో ఇక సమావేశాలకు హాజరు కావడం దండగ అన్న భావనలో ఉన్నారు. నీతి ఆయోగ్ ప్రారంభించి సమయంలో కనిపించిన స్ఫూర్తి లోపించింది. నీతి ఆయోగ్ ఏర్పాటు దశలో ప్రధాని మోడీ ఆనాడు చేసిన ప్రకటనకు భిన్నంగా ఈ పదకొండేదేళ్లుగా నీతి తప్పిన ఆయోగ్‌గా అవతరించింది. సహకార సమాఖ్య సూత్రాలకు అనుగుణంగా మొత్తం దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలంటే ఆయా రాష్ట్రాలకు తగిన గౌరవం ఇచ్చి వారిని కూడా ఇందులో భాగస్వాములను చేయాల్సి ఉంది. రాష్ట్రాలను కలుపుకుని ముందుకు సాగాల్సిన కేంద్రం ఆ దిశగా పనిచేయడం లేదు. మళ్లీ పాతపద్దతిలోనే సాగుతోంది. నీతి ఆయోగ్ లక్ష్యాలను విస్మరించారు. ఇక్కడ జరిగే చర్చలకు పెద్దగా ప్రాధాన్యం ఉండడం లేదు. ఇదే విషయాన్ని పలువురు సిఎంలు నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు. అంతెందుకు ఒకే పన్ను విధానం అంటూ తీసుకుని వచ్చిన జిఎస్టీని సమర్థించిన ఆయా రాష్ట్రాల సిఎంలే ఇప్పుడు దాని బారినుంచి రక్షించాలని కోరుకుంటున్నారు. వివిధ రంగాలపై అది చూపిస్తున్న చెడు ప్రభావాన్ని విశ్లేషించు కోవాల్సిన కేంద్రం ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందే తప్ప ప్రజల కోణంలో ఆలోచించడం లేదు. ప్రజలు అనేక సందర్భాల్లో తమ నిరసనలు వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. బ్యాంకుల్లో దాచుకున్న డబ్బును సొంత అవసరాలకు తీసుకోవ డానికి కూడా ఇబ్బంది పడటాన్ని గ్రామాల్లో ఇప్పటికీ చూస్తున్నాం. నగదు ఉపసంహరణపై ఎన్నో ఆంక్షలు పెట్టారు. ఇలాంటి వాటి వల్ల ప్రజలు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. ఆహారధాన్యాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఇవన్నీ నీతి ఆయోగ్‌లో చర్చించడం లేదు. పార్లమెంటులో చర్చకు అవకాశం ఉండడం లేదు. మొత్తంగా పాలకులకు అధికారమే తప్ప ప్రజలు కనబడడం లేదు. ఎంపిలు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గవర్నర్ వ్యవస్థ ఇలా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం బదులు నానాటికి దిగజారుస్తున్నాయి. ప్రజల డబ్బు నీళ్లప్రాయంగా ఖర్చవుతోంది. రాజకీయాల్లో ఎదుటి పక్షాలను ఢీకొట్టేందుకు తమ తెలివిని ఉపయోగిస్తున్న పాలకులు ప్రజల సమస్యలు పరిష్కరించ డంలో శ్రద్ధ చూపడం లేదు.రాజకీయ సంస్కరణలు రావాలి. పాలకుల తీరులో మార్పు రావాలి. ప్రజాధనం వృథా ఖర్చులకు కళ్లెం పడాలి. ముక్కుపిండి వసూలు చేస్తున్న పన్నులను పాలకుల విసలాలకు ఖర్చు చేసుకుంటున్నారు. ఉమ్మడి ఎపి విడివడ్డ తరవాత జరిగిన ఆర్థిక విధ్వంసమే ఇందుకు కారణం. అభివృద్ధి పేరుతో చేసిన అప్పులకు నేతలను బాధ్యులుగా చేస్తే మంచిది. రాజ్యాంగం ఏ మేరకు ఎంతవరకు అమలు సాధించామన్నది పాలకులుగా రాజకీయ పార్టీల నేతలు మననం చేసుకోవాలి. అందరికీ సమ న్యాయం అందుతుందా అన్నది చూడాలి. నేలవిడిచి సాము చేసే విధంగా దేశీయంగా ఉత్పత్తులపై దృష్టి పెట్టి స్వయం సమృద్ది సాధించకుండా దావోస్ లాంటి వేదికలపై పెట్టుబడులకు వెంపర్లాడుతున్న విధానం పోవాలి. దేశీయంగా ఉన్న సాంకేతికతను ఉపయోగించుకుని యువతను స్వయం సమృద్దికి సన్నద్ధం చేయాలి. వ్యవసాయం, అనుబంధ రంగాలను అభివృద్ధి చేస్తే ఈ దేశం ఇతర దేశాలకు ఆహారధాన్యాలను ఎగుమతి చేయగలదు. సింగపూర్, మలేషియా తదితర చిన్నదేశాలను ఆదర్శగా తీసకుని ఆయా రాష్ట్రాలు స్వయం సమృద్ది సాధించే ప్రణాళికలతో సాగాల్సిన అవసరాన్ని గుర్తించాలి. నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ఆరోగ్యం అందని ద్రాక్షగా మారింది. విద్య విలాసవస్తువుగా మారింది. ఇలాంటి అసమానతలను రూపుమాపేందుకు పాలకులు చిత్తశుద్దితో కృషి చేయడం లేదు. ఈ రంగాలకు కేటాయింపులు పెరగడం లేదు. ఆనాటి పాలకుల దూరదృష్టి లోపం కారణంగా మనకు వారసత్వంగా వచ్చిన సకల అవలక్షణాలు ప్రజలను ఇంకా దరిద్రంలోనే ముంచెత్తుతున్న వేళ పాలకులు గతాన్ని నెమరేసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ఆహారధన్యాలను ఇంకా ఎందుకు దిగుమతి చేసుకుంటున్నామో ఆలోచన చేయాలి. రాజకీయ దృక్కోణంలో కాకుండా అభివృద్ధి కోణంలో పాలన చేయాల్సిన విషయాన్ని పాలకులు వంటబట్టించుకోవాల్సి ఉంది. ఐదేళ్లు అధికారంలోకి రాగానే మరో ఐదేళ్లు గద్దెపై ఉండడమెలా అన్న ఆలోచన చేయడం వల్లనే భారత్ కూడా ఇంకా దారిద్య్రం, నిరక్షరాస్యత, వసతుల కొరత, ఆహారధాన్యాల కొరతతో అలమటిస్తోం ది. ఇదంతా పాలకుల దృష్టి లోపంగా చూడాలి. నిజానికి దేశంలో నల్లధనం, అవినీతి పోవాలంటే రాజకీయ పార్టీల నుంచే ప్రక్షాళన మొదలవ్వాలి. నల్లధనం రూపంలో రాజకీయ పార్టీలు విరాళాలు తీసుకుని ఓటర్లను కొనుగోలు చేయడా నికి వాడుతున్నాయి.వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు రాజకీయ పార్టీలకు ఇస్తున్న విరాళాలలో అత్యధిక భాగం నల్లడబ్బు రూపంలోనే ఉంటోంది. ఈ పరిస్థితిని నివారించకుండా ఎన్ని సంస్కరణలు చేసినా ఫలితం ఉండదు. ప్రజలకు అందని నగదు రాజకీయ పార్టీలకు మాత్రం లభిస్తోంది. ఎన్నికల్లో ఆయా పార్టీలు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న వైనం చూస్తున్నాం. అన్నిరంగాల్లో మనం ముందంజ వేయాల్సిన దశలో ఇంకా దిగుబడులపై ఆధారపడుతూ ఎగుమతుల విషయంలో లక్ష్యం లేకుండా సాగుతున్నాం. మనం చేపట్టిన సంస్కరణలు ఫలితాలు ఇవ్వడం లేదన్న విషయాన్ని గుర్తించడం లేదు. నీతి ఆయోగ్‌ను బలోపేతం చేస్తూ రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని ఉమ్మడిగా ముందుకు సాగాల్సి ఉంది.

## మొక్కలు నాటుదాం.. పర్యావరణం కాపాడుదాం

విజయవాడ,:మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయని వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం, వనమహోత్సవం –2025 కార్యక్రమాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో విజయవాడ రూరల్ కొత్తూరు తాడేపల్లి వద్ద నగరవనం వద్ద మంత్రి సత్యకుమార్ యాదవ్, స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ డా.జి లక్ష్మీశ మొక్కలను నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మొక్కలు నాటుదాం.... పర్యావరణాన్ని కాపాడుదాం... అనే వినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మొక్కలను నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతౌల్యత పాటు జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో మొక్కలు నాటడం మాని చెట్లను నరికివేసేవారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మొక్కలు నాటడాన్ని ప్రోత్సహిస్తున్నారన్నారు. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ విలువను ప్రతి ఒక్కరు గుర్తించారని అన్నారు. ఒక చెట్టు– తన జీవిత కాలంలో 50 నుండి వంద సంవత్సరాల కాలంలో రూ. 10 లక్షలు విలువైన ఆక్సిజన్ ప్రకృతికి అందిస్తుందన్నారు. వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ శాతాన్ని ఉష్ణోగ్రతను తగ్గిస్తాయన్నారు. పర్యావరణ సమతుల్యత లోపించడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించి వరదలు తుఫానులతో అపార నష్టాన్ని కలిగిస్తున్నాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెట్టు–ను అమ్మతో పోలుస్తూ ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో ఒక చెట్టు– నాటండి) అని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. చెట్లను పెంచడం వల్ల కలిగే లాభాలను మన పిల్లలకు నేర్పి వారిలో అవగాహన పెంచాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న 29 శాతం గ్రీనరీని స్వర్ణాంధ్ర విజన్ 2047 నాటికి 50 శాతం పెంచేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నామన్నారు. మొక్కలు నాటు–దాం వాటిని సంరక్షిద్దాం అనే వినాదంతో హరిత విస్తీర్ణాన్ని పెంచి ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు అవుదామని మంత్రి సత్య కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ నేడు పర్యావరణ సమతౌల్యత దెబ్బ తినడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయన్నారు. బుడమేరుకు ఆకస్మిక వరదలు సంభవించి నష్టాన్ని కలిగించా యని ఉదహరించారు. పకృతిని దూరం చేయకుండా దగ్గరకు తీసుకుందాం అన్నారు. చెట్లను పెంచడం సామాజిక స్పృహగా భావించి ప్రకృతిని కాపాడుకుందాం అన్నారు. తాను ప్రకృతి ప్రేమికుడునని వసంత గ్రీన్ ప్రాజెక్ట్ పేరుతో పెద్దఎత్తున మొక్కలనునాటి సంరక్షిస్తున్నానని శాసనసభ్యులు అన్నారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ మానసిక వికాసానికి యోగాంధ్ర దోహదపడుతున్నట్లే పర్యావరణాన్ని కాపాడుకోవడానికి మొక్కలను నాటి పచ్చదనం పెంచుదామన్నారు. జిల్లాలో ప్రస్తుతం 11 శాతం ఉన్న గ్రీనరీని 33 శాతం పెంచేలా చర్యలు తీసుకుంటు–న్నామన్నారు. దీనిలో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పరిసరాలు, రహదారులకు ఇరుపక్కల, గ్రామపంచాయతీలు, అంగన్వాడీలు, దేవాలయాల ఆవరణలో అటవీ, పంచాయతీరాజ్, ఉపాధి హామీ శాఖల సమన్వయంతో ఈ ఏడాది 2 లక్షల 60 వేల మొక్కలను నాటేలా ప్రణాళిక రూపొందించుకుని అమలు చేస్తున్నామని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్డిఓ కావూరి చైతన్య, జిల్లా అటవీ శాఖ అధికారి జి. సతీష్, డిపిఓ పి.లావణ్య కుమారి, డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, డ్వామా పీడీ ఎ.రాము, జిల్లా అటవీ శాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.శ్రీనివాసుల రెడ్డి, డిప్యూటీ– రేంజ్ ఆఫీసర్ పి.రాజు తదితరులు ఉన్నారు.

## ఎలా నష్టం?

హైదరాబాద్,తెలంగాణ జాగృతి పేరుతో సొంత రాజకీయాలు చేస్తున్న కవిత బనకచర్ల ప్రాజెక్టు గురించి అందరూ గళమెత్తాలని పిలుపునిచ్చారు. ఆమె తీరు చూస్తుంటే రేపు ఏపీ మీద పడి రాజకీయం చేసే వ్యూహంలో బనకచర్లనే హైలెట్ చేసేలా ఉన్నారు. ఈటల రాజేందర్ ను మాట్లాడాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ నేతలు చంద్రబాబు బనకచర్ల కట్టేస్తున్నారని రచ్చ చేస్తున్నారు. ప్రజల్ని రెచ్చగొట్టి రాజకీయం చేయాలనుకుంటున్నారు. రెండురాష్ట్రాల మధ్య ద్వేషాలు పెంచి రాజకీయ పబ్బం గడుపుకోవాలని అనుకుంటున్నారు. కానీ బనకచర్లను ఏపీ నిర్మిస్తే దాని వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టం జరుగుతుందో మాత్రం చెప్పడం లేదు.

బనకచర్ల సముద్రంలోకి పోయే నీటిని ఎత్తిపోసుకునే ప్రాజెక్టు

శ్రీశైలం, సాగర్ వంటి ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని కేటాయింపుల ఆధారంగా విడుదల చేసుకుంటూ ఉంటారు. ఈ రెండింటి నుంచి నీటిని తరలించుకునే ప్రాజెక్టులు నిర్మించుకోవాలంటే అనుమతులు తీసుకోవాలి. కానీ ఎక్కడా నిల్వ ఉండని. వరదలు వచ్చినప్పుడు సముద్రంలోకి పోయే నీటిని మళ్లించుకునేందుకు బనకచర్ల నిర్మిస్తున్నారు. గోదావరికి ప్రతి ఏడాది వచ్చే వరదల వల్ల వేల టీఎంసీల నీరు సముద్రం పాలవుతోంది. అత్యంత దిగువ రాష్ట్రంగా ఆ నీటి వృధాను ఏపీ కళ్లారా చూస్తోంది. వాటిని పొలాలకు మళ్లించుకోవాలనే ఆలోచన చేస్తుంది. ఒక వేల అలా చేయకపోతే సముద్రంలోకి పోతాయి కానీ తెలంగాణలోకి కాదు.

ఏపీ ఎత్తిపోసుకోకపోతే పోయేది సముద్రంలోకే.. తెలంగాణలోకి కాదు !

గోదావరి, కృష్ణా జలాల కేటాయింపుల విషయంలో వివాదాలు ఉండవచ్చు కానీ ఇప్పటికీ అమల్లో ఉన్న ఒప్పందాలు ఉన్నాయి. ఆ ప్రకారం కేటాయింపులు జరుగుతున్నాయి. వాడుకుంటున్నారు. బనకచర్లను నిర్మిస్తే తెలంగాణకు కేటాయించిన నీటి నుంచి ఒక్క చుక్క కూడాతీసుకోలేరు. గోదావరిపైనే లక్ష కోట్లను పెట్టి కాళేశ్వరం తెలంగాణ నిర్మించుకుంది. అయినా వేల టీఎంసీలు సముద్రంలోకి పోతున్నాయి. అది ఎగువన కట్టారు. అంటే వారు ఎత్తిపోసుకోగలిగినంత ఎత్తిపోసుకున్న తర్వాతనే దిగువకు వస్తాయి. అంటే ఏపీకి వస్తాయి. మరి ఆ వరద నీటిని ఏపీ వాడుకుంటే ఎందుకు వివాదం చేస్తున్నారు?. ఇంకా ఎంతో నీరు వృధాగా పోతోందని.. ఇంకా ప్రాజెక్టులు కట్టుకోవాలని దిగువ రాష్ట్రం ఏపీ ఆఫర్ ఇస్తోంది కూడా.

ద్వేష రాజకీయాలకు కాలం చెల్లింది !

ఉమ్మడి రాష్ట్రంలో ప్రజల మధ్య వైషమ్యాలు పెంచి తెలంగాణ వాదానికి బలం పెంచుకోగలిగారు. కానీ ఇప్పుడు ప్రజల్లో చైతన్యం వచ్చింది. ఎవరు రెచ్చగొడుతున్నారు.. ఎవరు రాజకీయం చేస్తున్నారో అందరికీ అర్థమైపోతుంది. దిగువ రాష్ట్రమైన ఏపీని ఇప్పటికీ బూచిగా చూపించి రాజకీయాలు చేయాలనుకుంటే .. మళ్లీ ప్రాణాలు అర్పించడానికి.. ప్రజలు సిద్ధంగా ఉండరు. రెచ్చగొట్టే రాజకీయాలపై ఇప్పటికీ స్పష్టత ప్రజలకు వచ్చింది. దిగువ రాష్ట్రమైన ఏపీ.. ఎగువ రాష్ట్రమైన తెలంగాణ నీటిని లాక్కుంటుందని ప్రచారం చేస్తే నమ్మడానికి ఎవరు సిద్ధంగా ఉంటారు ?. బనకచర్ల తో సముద్రంలోకి పోయే నీళ్లను ఏపీ ఎత్తి పోసుకుంటే..

# భటింగే తో కటింగే.. నినాదం కాదు, నిజం!



న్యూఢిల్లీ,పధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలోని ఎన్డీఎ ప్రభుత్వానికి వరసగా మూడవసారి ప్రజా పట్టాభిషేకం జరిగి సంవత్సరం పూర్తయింది. అవును.. గత సంవత్సరం జూన్ 4,5 తేదీలలో 2004 లోక్ సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరిగింది. ఫలితాలు వెలువడ్డాయి. ఎన్డీఎ విజయ కేతనం ఎగరేసింది. మోదీ సర్కార్ ముచ్చటగా మూడవసారి అధికారంలోకి వచ్చింది. హ్యాట్రిక్ కొట్టింది. స్వతంత్ర భారత తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ తర్వాత వరసగా మూడవ సారి ప్రధాని పదవిని చేపట్టిన తొలి ప్రధానిగా మోదీ చరిత్రలో స్థానం సంపాదించుకున్నారు. అంతవరకు బాగుంది.. అయితే ఈ ఎన్నికల్లో ప్రజలు అంతకు మించిన సందేశమే ఇచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో దేశ ప్రజలు వరసగా మూడవ సారి ప్రధాని మోదీ పాలన పట్ల విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. అయితే అది సంపూర్ణమా అంటే కాదు. ఎన్డీయేకి అధికారాన్నిఅయితే అప్పగించారు కానీ.. ఎన్డీఎకు ఆశించిన మెజారిటీ రాలేదు. అలాగే.. ఎన్డీఎ కూటమికి సారధ్యం వహిస్తున్న బీజేపీకి కూడా ఆశించిన ఫలితాలు రాలేదు. కమల దళం కలలు కన్న 400 ప్లస్ (చార్ సౌ పార్) నెంబర్ కు ఆమడల దూరంలోనే బీజేపీ స్కోర్ ఆగిపోయింది. ఆశించిన నెంబర్ రాక పోవడమే కాదు.. సిట్టింగ్ స్థానాలకే పెద్ద ఎత్తున గండి పడింది. బీజేపీ బలం 303 నుంచి 240కి పడిపోయింది. అంతే కాదు వరసగా రెండు ఎన్నికల్లో (2014,2019), సొంతంగానే మెజారిటీ సొంతం చేసుకున్న బీజేపీ మూడవ సారి మాత్రం ఆ మెజారిటీ సాధించలేకపోయింది. బీజేపీ ఎంపీల సంఖ్య సింపుల్ మెజారిటీకి 32 సీట్ల దూరంలో ఆగిపోయింది. అయినా.. ఎన్డీఎ కూటమి 293 సీట్లు గెలవడంతో అధికారం నిలబడింది. ముఖ్యంగా తెలుగుదేశం (16), జనతదళ్(యు)(11) మద్దతుతో మోదీ ముచ్చటగా మూడవ సారి ప్రధాని అయ్యారు.

మోదీ ప్రధాని అయ్యారు కానీ.. మోదీ 3.0 ప్రభుత్వం ముందులా కీలక నిర్ణయాలు తీసుకోగల్గుతుందా? మోదీ సుస్థిర పాలన కొనసాగించ గలరా? అనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో సర్వత్రా వ్యక్తమయ్యాయి. మరో వంక.. సంకీర్ణ కట్టుబాట్లు జాతీయవాద ఎజెండాకు బ్రేకులు వేస్తాయా? అనే సందేహాలు సంఘ్ పరివార్ వర్గాల్లో వ్యక్తమయ్యాయి. అయితే.. ఇటు చంద్రబాబు, అటు నితీష్ కుమార్ మోదీకి అండగా నిలవడంతో ఆనాటి అనుమానాలు అన్నీ తొలగి పోయాయి. మోదీ సర్కార్ ప్రయాణం సజావుగా సాగుతోంది. ఎన్డీయే భాగస్వామ్య పార్టీల నేతలు ముఖ్యంగా..టీడీపీ అధినేత,ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీహార్ ముఖ్యమంత్రి, జేడీ(యు) అధ్యక్షుడు నితీష్ కుమార్ రాజనీతిజ్ఞతతో పార్టీలు వేరైనా అంతరంగం ఒకటే అన్నట్లుగా సుస్థిర అభివృద్దే లక్ష్యంగా ఒకటిగా సాగుతున్నారు. అందుకే.. మోదీ ప్రభుత్వం పేరుకు సంకీర్ణ ప్రభుత్వమే అయినా సుస్థిరంగా సాగుతోందని విశ్లేషకులు అంటున్నారు. చివరకు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కూడా మోదీ 3.0 ప్రభుత్వం ముందు కంటే మరింత స్థిరంగా ముందుకు సాగుతోందనీ,శషభిషలు లేకుండా స్థిరమైన నిర్ణయాలు తీసుకుంటోందని అన్నారు.మరోవంక.. 2024 ఎన్నికల ఫలితాలు ప్రతిపక్ష ఇండియా కూటమి, ముఖ్యమంగా కూటమికి సారధ్యం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీలో కొత్త ఆశలకు అవకాశం కల్పించాయి. వరసగా రెండు ఎన్నికల్లో ప్రతిపక్ష హోదాకు కూడా నోచుకోని కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ప్రజలు ప్రతిపక్ష హోదాను ఇచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రతిపక్ష నాయకుడయ్యారు. అదొకటి అయితే.. 2024 ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును, విశ్లేషించుకుంటే, అటు బీజేపీకి అయినా ఇటు కాంగ్రెస్ కు అయినా మిత్ర పక్షాల చేదోడు అవసరమని స్పష్టం చేశాయి. మిత్రపక్షాల సహకారం లేకుండా అధికారమే కాదు.. ప్రతిపక్ష హోదా కూడా అసాధ్యమనే వాస్తవాన్ని 2024 ఎన్నికల ఫలితాలు విశదీకరించాయి. నిజానికి.. 2024 ఎన్నికల ఫలితాలే కాదు, ఈసంవత్సర కాలంలో జరిగిన వివిధ రాష్ట్రాల శాసన సభల ఎన్నికల ఫలితాలు కూడా అదే స్పష్టం చేస్తున్నాయి. అందుకే, బీజేపీ ఎక్ హై తో సేఫ్ హై.. భటింగే తో కటింగే' (కలిసి ఉంటే కలదు సుఖం,విడిపోతే పడిపోతాం) అనే నినాదాన్ని ఉభయ తారకంగా ఉపయోగించుకుని లోక్ సభ ఎన్నికల నష్టాన్ని మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల్లో పూడ్చుకుంది. ఆ యా రాష్ట్రాలలో అధికారంలోకి రావడమే కాకుండా.. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన జమ్మూ కశ్మీర్, ఝూరఖండ్ తదితర రాష్ట్రల్లోనూ ప్రధాన ప్రతిపక్ష హోదాను పొందగలిగింది. మరో వంక కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఏమిటో వేరే చెప్పనక్కరలేదు. దేశ రాజధానిలో వరసగా అరవ సారి జీరో' గా మిగిలింది. సో... ఎక్ హై తో సేఫ్ హై.. భటింగే తో కటింగే' నినాదం కాదు నిజం అంటున్నారు.

# తొక్కిసలాటల తప్పెవరిది?



బెంగళూర్ :తొక్కిసలాటతో తప్పెవరిది? జనం ఇంతగా ఎగబడుతున్నారేంటి? పుష్ప 2 రిలీజ్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగి ఒక మహిళ మృతి చెందగా... ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడి ఇప్పటికీ కోలుకోలేదు. ఇక వైకుంఠ ఏకాదశి రోజున తిరుపతిలో తొక్కిసలాట జరిగి టీటీడీ చరిత్రలోనే అతి భారీ ప్రాణ నష్టం సంభవించింది. ఆరుగురు ఏకంగా వైకుంఠం చేరుకున్నారు. ఇక మహా కుంభమేళాలో కూడా సరిగ్గా ఇలాంటి తొక్కిసలాటల్లోనే పదుల సంఖ్యలో ప్రాణాలు పోయాయి. ఇప్పుడు చూస్తే ఆర్సీబీ గెలిచిందన్న సంతోషంలో బెంగళూరు చిన్నసామి స్టేడియంలో విజయోత్సవాలకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగి 11 మంది ప్రాణాలు కోల్పోయారు. 33 మంది వరకూ గాయ పడ్డారు. ఈ ఏడాది ఐపీఎల్ విన్నర్లకు ప్రభుత్వం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఇది కేవలం 30 నలభై వేల మంది మాత్రమే పట్టేంత చిన్న స్టేడియం. లక్షలాది మంది రావడంతో అంతా రసాబాస అయిపోయింది. చిన్నబిడ్డ నలిగిపోవడంతో పాటు ఒకరికి కత్తిపోట్లంటే పరిస్థితేంటో ఊహించుకోవచ్చు. ఇప్పుడున్న రోజుల్లో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతూ ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకరం. ఎందుకంటే ఇప్పుడు అంతగా ఎగబడాల్సిన అవసరమే లేదు. నిజానికి ఐపీఎల్ అన్నది చాలా చాలా చిన్న విషయం. ఎందుకంటే అది ఏం పెద్ద ట్రోఫీ కాదు. కాకుంటే ఇక్కడ కన్నడ జనం ఎన్నో ఎదురు చూపుల తర్వాత వచ్చిన కప్పు కావడం.. కోహ్లీ ఫ్యాన్స్ కి ఇదొక పండగ రోజే కాదనడం లేదు. కానీ ఇలాంటి ప్రాంతాలకు వెళ్లడంలో ప్రజలదే తప్పనుకోవాలి. గతంలో తమ అభిమాన నాయకుడ్ని కావచ్చు, క్రికెటర్ని కావచ్చు దగ్గర్నుంచి చూసే ఛాన్స్ ఉండక పోయేది. అదే ఇప్పుడు ఎల్ఈడీ స్క్రీన్లు వచ్చేశాయ్. ఇంట్లో కూడా పెద్ద ఎత్తున బుల్లి తెరలు పెట్టుకుని. డైరెక్ట్ లైవ్ ఎక్స్ పీరియన్స్ ట్రై చేయొచ్చు. పుష్ప 2 విషయమే తీసుకుంటే ఇప్పుడున్న పైరసీ ఓటీటీ మానియాలో అంతగా సినిమా చూడ్డానికి ఎగబడ్డమేంటి? అది కూడా ప్రీమియర్ షో చూడ్డానికి పోటీపడ్డం ముమ్మాటికీ తప్పే. ఇందులో ఆ కుటుంబం తప్పే ఎక్కువ అని భావించాల్సి ఉంటుంది. ఇక తిరుమలలో ఇదే వైకుంఠ ద్వారా దర్శనానికి పది రోజుల పాటు అవకాశముంటుంది. ఎప్పుడైనా వెళ్లొచ్చు. కానీ జనం ఎగబడ్డంతో అక్కడా పరిస్థితి అదుపుతప్పింది. ఇప్పుడు టీటీడీ ఎన్నేసి లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా ఇచ్చినా.. పోయిన వారి ప్రాణాలు తిరిగొస్తాయా? అయిన వారిని పోగొట్టుకున్న కుటుంబాల వెత తీరుతుందా? ఇక కుంభమేళా పరిస్థితి కూడా అంతే.. అదే పనిగా పర్వదినాలపుడు వెళ్లడం సరి కాదు. కానీ జనం ఎగబడి భారీ ఎత్తున ప్రాణాలు కోల్పోతున్నారు. గతంలో కనీ వినీ ఎరుగని రీతిలో.. ఢిల్లీ రైల్వే స్టేషన్లో కూడా తోపులాట జరిగి జనం మృతి చెందారంటే పరిస్థితి ఊహించుకోవచ్చు. అంత పిచ్చి చాదస్తమేంటి? మహా కుంభమేళాకు వెళ్లని వాళ్లు బతికి ఉంటే వెళ్లిన వాళ్లు చనిపోవడాన్ని ఏమని అర్థం చేసుకోవాలి???ఇప్పుడు చూస్తే చిన్నస్వామి స్టేడియం విషయం. అంతగా ఎగబడ్డంలో పబ్లిక్ దే తప్పుగా భావించాలి. ఇప్పటి రోజుల్లో పది మంది గుమిగూడే చోటకు వెళ్లడంలో వారి వారిదే తప్పు అవుతుంది. అంతగా ఎగబడాల్సిన అవసరం ఏముంది? ఇప్పుడా 11 మంది మృతుల్లో ఎందరు తల్లిదండ్రుల ఆశాజ్యోతులైన కుర్రాళ్లుంటారు? వారిని కోల్పోయిన ఆ పేరెంట్స్ కడుపుకోత ఎంతిచ్చి రుణం తీర్చుకోగలం.ఇలాంటి మానసిక స్థితి పూర్తిగా తప్పు. ఇదే కోహ్లీ తనను చూడ్డానికి జనం రావాలనుకుంటాడు, కానీ ఇలా ఎవర్నో చూడ్డానికి ఎగబడడు. కోహ్లీని చూస్తే ఏమొస్తుంది? తన కోసం జనం చచ్చేంతగా ఎగబడ్డాడని అతడనుకోవడం మినహా మరేదైనా లాభం ఉంటుందా? అతడి సంగతి అలా ఉంచితే ఇపుడా తల్లిదండ్రులు కుటుంబ సభ్యుల కడుపుకోత తీర్చేవారెవరు? ఈ దిశగా వీరంతా ఎందుకు ఆలోచించడం లేదు!!!ఒక్కోసారి క్రౌడ్ ఎగబడితే అక్కడున్న పోలీస్ సపోర్ట్ కూడా సరిపోదు. ఇక్కడే కాదు ఎక్కడైనా సరే పోలీసు సిబ్బంది ఎంత మంది జనం ఉన్నారో అంత మందికి సరిపడా ఉండరు. ఇలా ఎగబడితే వాళ్లు కూడా చేతులెత్తేయడం ఖాయం. నిజానికి బెంగళూరు పోలీసులు చాలా చాలా స్ట్రిక్ట్. స్పీడ్ లిమిట్ పెరిగితే వేగంగా దూసుకెళ్తున్న బండ్ల మీద లాఠీలు విసురుతారు. అలాంటి పోలీసుల వల్ల కూడా ఈ తొక్కిసలాట కంట్రోల్ కాలేదంటే పరిస్థితి ఊహించుకోవచ్చు. ఇప్పుడు కోహ్లీని చూడ్డానికి ఎగబడ్డారు సరే. మరి ఆయన్ను చూడ్డానికే వీరు లేరు. అలాంటి పరిస్థితి తెచ్చుకోవడం తప్పు.. కోహ్లీ కావచ్చు అతడి టీమ్ మేనేజ్మెంట్ కావచ్చు టీమ్ మెంబర్స్ కావచ్చు.. పోలీసుల తప్పు కూడా ఉండక పోవచ్చు. అంతగా ఎగబడ్డ జనానిదే అవుతుందని అంటారు సామాజికవేత్తలు.

# పవన్ సౌండ్ తగ్గుతోందా ?

అమరావతి,ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వంలో అతి ముఖ్య భాగస్వామ్య పార్టీగా జనసేన ఉంది. జనసేనకు 21 సీట్లు మాత్రమే ఉండవచ్చు. కానీ అక్కడ ఉన్నది పవర్ స్టార్. నిండుగా గ్లామర్ తో పాటు అండగా బలమైన సామాజిక వర్గం ఉన్న పవన్ చరిష్మాయె కూటమికి శ్రీరామ రక్ష అన్నది తెలిసిందే. ఏపీలో 2024లో కూటమి అధికారంలోకి రావడం వెనక పవన్ ఫ్యాక్టర్ ఎంతగానో పనిచేసింది.ఇక పవన్ కూడా ప్రభుత్వంలో ఉంటారు కాబట్టి ఈసారి ప్రభుత్వం తీరులో మౌలికమైన మార్పులు కనిపిస్తాయని అంతా భావించారు. కానీ ఏడాది కూటమి పాలనలో ఎక్కడా పవన్ మార్క్ అన్నది పెద్దగా లేదని అంటున్నారు. జనసేన కూడా ప్రజల కోసం కొన్ని అనుకుంది. జనసేన అయిదేళ్ల పాటు తన సభలూ సమావేశాలలో వాటిని చెబుతూ వచ్చింది.నిరుద్యోగ యువతకు పది లక్షల రూపాయలు ఇవ్వడం ద్వారా వారితో పరిశ్రమలు పెట్టించాలని తద్వారా వారి నుంచి మరో పది మందికి ఉపాధి దక్కేలా చూడాలని ప్రతిపాదించింది. అయితే ఏడాది పాలనలో దాని గురించి ప్రస్తావన అయితే లేదని అంటున్నారు.ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి హోదాతో పవన్ ఉన్నారు. అన్ని ప్రభుత్వ ఆఫీసులలో చంద్రబాబుతో పాటుగా పవన్ ఫోటో కూడా పెడుతున్నారు. కానీ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలలో జనసేన పాత్ర ఏ మేరకు ఉంది అన్నది తెలియడంలేదు అని అంటున్నారు. ఇక అమరావతి రాజధానితో పాటుగా ఉభయ గోదావరి జిల్లాలను కూడా అభివృద్ధి చేయాలని ప్రత్యేక ప్రాజెక్టులను మంజూరు చేయాలని మాజీ మంత్రి చేగొండి హరి రామ జోగయ్య జనసేనకు లేఖ రాశారు. దాని మీద కూడా జనసేన పెద్దగా రియాక్ట్ కాలేదని అంటున్నారు. అలాగే ఆర్ధికంగా వెనకబడిన వారికి ఇచ్చిన పది శాతం రిజర్వేషన్లలో అయిదు శాతం కాపులకు ఇవ్వాలని కూడా ఆయన కోరారు. దానికి కూడా స్పందించినది లేదు అని అంటున్నారు.ఇంకో వైపు చూస్తే ప్రభుత్వం మీద సహజంగానే తెలుగుదేశం ముద్ర ఉంది. టీడీపీ అధినాయకుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారు. దాంతో 2014 నుంచి 2019 దాకా సాగిన టీడీపీ ప్రభుత్వంగానే అత్యధిక శాతం పాలన ఉంది. కానీ కూటమి పాలనగా కనిపించడం లేదని అంటున్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం అని వైసీపీ ఆరోపిస్తోంది. రాజకీయ కక్ష



సాధింపులకు వ్యతిరేకం అని అధికారంలోకి వచ్చిన కొత్తలో పవన్ చెప్పారని గుర్తు చేస్తున్నారు. మరి రెడ్ బుక్ పేరుతో సాగుతున్న కార్యక్రమాల మీద జనసేన కూడా అంగీకారం గా ఉందా అని వైసీపీ నుంచే ప్రశ్నలు వస్తున్నాయి.మరో వైపు చూస్తే మొదట్లో పవన్ కళ్యాణ్ గట్టిగానే మాట్లాడారు, మహిళల మీద అత్యాచారాలు కానీ లా అండ్ ఆర్డర్ విషయంలో కానీ కాకినాడ పోర్టు నుంచి తరలిపోతున్న అక్రమ బియ్యం విషయం గురించి కానీ తిరుపతి తొక్కిసలాట మీద కానీ ఆయన తనదైన స్టాండ్ తీసుకుని మాట్లాడారు. కానీ ఆ తర్వాత అయితే పెద్దగా సౌండ్ లేదని అంటున్నారు.దీంతో ఏపీలో రొటీన్ పాలన సాగుతోందని అందులో జనసేన పాత్ర పెద్దగా ఏమీ లేదన్న భావన వ్యక్తం అవుతోంది. వీధి వీధినా బెల్ట్ షాపులు వచ్చేస్తున్నాయి. అలాగే ఇసుక దందాలు సాగుతున్నాయి. అవినీతి అక్రమాలు అలాగే ఉన్నాయి. మరి వీటి మీద జనసేన చెప్పాల్సింది లేదా అని అంటున్నారు. ఏది ఏమైనా అయిదేళ్ళ వైసీపీ పాలనలో గట్టిగా వినిపించిన పవన్ వాయిస్ ఇపుడు అయితే సౌండ్ బాగా తగ్గింది అని అంటున్నారు. అయితే ప్రభుత్వంలో ఉండడం వల్ల బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుంది అనుకున్నా నాలుగు గోడల మధ్యన చెప్పాల్సింది చెప్పినా తీరు తెన్నులలో మార్పు వచ్చేది కదా అంటున్నారు.

# మిఠాయి ఇస్తూనే తిట్టించుకోవటమేంటి రేవంత్?



హైదరాబాద్,పభుత్వం ఏదైనా.. ముఖ్యమంత్రిగా ఎవరున్నా.. కొన్ని విషయాల్లో ఒకే విధానాన్ని ఫాలో కావాల్సిందే తప్పించి.. తాము అనుకున్నది చేయలేని పరిస్థితి. మిగిలిన ముఖ్యమంత్రుల కంటే భిన్నంగా వ్యవహరించాలని డిసైడ్ అయినా.. ఎదురుదెబ్బలు ఖాయం. ఈ విషయాన్ని గుర్తించిన ముఖ్యమంత్రులు అనవసరమైన డ్యామేజ్ కు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా మసులుకుంటారు. అందులో ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగుల అంశంగా చెప్పాలి. ఈ విషయాన్ని కాస్తంత ఆలస్యంగా గ్రహించినట్లుంది తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. కేసీఆర్ పదేళ్ల ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా అప్పులు చేయటం.. డాబు ఖర్చులు చేసి.. రేవంత్ ప్రభుత్వం కొలువు తీరే నాటికి.. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.దీంతో.. రాష్ట్ర దారుణ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేందుకు ప్రయత్నించిన రేవంత్.. ఆ క్రమంలో తొందరపాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి అప్పులు పుట్టటం లేదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పాలనతో తెలంగాణ ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని హైలెట్ చేయటం ఆయన ఉద్దేశమైతే.. ఆయన చేసిన వ్యాఖ్యలు తెలంగాణ పరువు తీసేలా మాట్లాడుతున్నారన్న భావన కలిగేలా చేశాయి. తెలంగాణ ఇమేజ్ డ్యామేజ్ చేస్తున్నారన్నట్లుగా కొన్ని వర్గాలు ఆగ్రహాన్ని వ్యక్తం చేసిన పరిస్థితి.ఇలాంటి వేళలోనే ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ల మీద స్పందించిన సీఎం రేవంత్.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత ఇబ్బందికరంగా ఉందన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. తనను కోసినా ఉద్యోగుల డిమాండ్లను ఆమోదించేది లేదంటూ చేసిన వ్యాఖ్యలు ఆయన ఇమేజ్ ను దారుణంగా దెబ్బ తీసిన పరిస్థితి. నిజానికి ప్రభుత్వం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల్ని చెప్పాల్సిన రీతిలో చెప్పి.. కాస్త ఓపిగ్గా ఎదురుచూస్తే.. వారి సేవలకు తగిన రీతిలో తమ ప్రభుత్వం స్పందిస్తుందన్న సంకేతాన్ని ఇచ్చి ఉంటే ఎలాంటి పంచాయితీ ఉండేది కాదు. అందుకు భిన్నంగా ఖర్చుల పెంపు విషయంలో తానెంత కఠినంగా ఉంటానన్న విషయాన్ని సీఎం రేవంత్ చెప్పిన వైనం ప్రభుత్వంపై ప్రభుత్వ ఉద్యోగుల మండిపడేలా చేసింది. ఈ ఆగ్రహాన్ని ముఖ్యమంత్రి గుర్తించినట్లుగా కనిపిస్తోంది. తాజాగా ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలు ఇవ్వాలని డిసైడ్ చేయటం దీనికి నిదర్శనంగా చెబుతున్నారు. ఒక కరువు భత్యాన్ని వెంటనే.. మరో డీఏను వచ్చే ఏప్రిల్ లో ఇవ్వాలన్న నిర్ణయాన్ని తాజాగా నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల ప్రభుత్వానికి ఉద్యోగులు 57 డిమాండ్లను ఇవ్వగా.. వాటిని పరిశీలించిన మంత్రివర్గం.. అధికారుల కమిటీ నివేదిక ప్రకారం కొన్ని అంశాల్నిఆమోదిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మరికొన్నింటిని పరిశీలనకు స్వీకరించినట్లుగా పేర్కొన్నారు.2023 జనవరి 1 నుంచి బకాయి ఉన్న డీఏల్లో ఒకటి వెంటనే చెల్లించి.. అప్పటి నుంచి బకాయి పడిన సొమ్మును 28 వాయిదాల్లో చెల్లిస్తామని పేర్కొన్నారు. మరో డీఏను వచ్చే ఏప్రిల్ లో ప్రకటించాలని నిర్ణయించారు. ఉద్యోగులు హెల్త్ కార్డులు ఇవ్వాలని అడుగుతున్నారని.. ఈ పథకం కింద ప్రతి ఉద్యోగి రూ.500 చొప్పున ఇవ్వాలని.. ఏడాది పాటు వాళ్లు జమ చేసిన సొమ్మునకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని డిసైడ్ చేశారు. ఒక ట్రస్టును ఏర్పాటు చేసి.. ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా సదరు ట్రస్టు ద్వారా సేవలు అందించాలని నిర్ణయించారు.కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగుల బిల్లుల్ని పెండింగ్ లో పెట్టింది. ఈ బిల్లుల్ని క్లియర్ చేయటానికి ప్రతి నెలా రూ.700 కోట్లు తగ్గకుండా చెల్లించేందుకు డిసైడ్ చేశారు. నెల వారీగా క్లియర్ చేస్తారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జాయింట్ స్టేట్ కౌన్సిల్ ను ఏర్పాటు చేయాలని.. ఉద్యోగ సంఘాలకు గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించారు. జీవో 317లో మరికొన్ని విభాగాల్ని చేర్చాలని నిర్ణయించారు. సచివాలయంలో ఉద్యోగుల కోటా 12.5 శాతం ఉండాలని.. మెడికల్ ఇన్ వాలిడేషన్ కమిటీ ఏర్పాటుకు ఓకే చెప్పారు .రిటైర్డు ఉద్యోగుల్ని మళ్లీ విధుల్లోకి తీసుకోకూడదని నిర్ణయించారు. డిపార్ట్ మెంటల్ ప్రమోషన్ కమిటీల సమావేశాల్ని రెగ్యులర్ గా నిర్వహించాలని నిర్ణయించారు. ఎన్నికల సమయంలో బదిలీ చేసిన అధికారుల్ని పాత స్థానాలకు పంపాలన్న డిమాండ్ కు ఆమోదం తెలిపారు. జిల్లా పరిషత్ లకు సంబంధించి కారుణ్య నియామకాలను చేపట్టాలని.. నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటుకు ఆమోదం పలికారు.అంగన్ వాడీ టీచర్ల రిటైర్మెంట్ ప్రయోజనాల్ని రూ.2 లక్షలకు పెంచేందుకు సానుకూలంగా స్పందించారు. ఉద్యోగుల వాహన అద్దెల్ని వెంటనే క్లియర్ చేయటంతో పాటు.. వారికిచ్చే ధరను పెంచాలని నిర్ణయించారు. ఇలా ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాలకు సానుకూలంగా స్పందించిన వైనం చూసిన తర్వాత.. వరాల మూట విప్పే ముందుకు 'కోసుడు' (నన్నునిలువునా కోసినా నేనేం ఇవ్వలేను) మాటలు మాట్లాడకుండా ఎంత బాగుండేదన్న మాట వినిపించటం గమనార్హం. అందుకే అంటారు.. ఇచ్చేది ఇస్తూనే.. తిట్టించుకోవటం అవసరమా? అని. ఇప్పటికైనా సీఎం రేవంత్ గత తప్పుల్ని రిపీట్ చేయకుంటే బాగుండు.

# విజయవాడలో డ్రగ్స్ కలకలం..



విజయవాడ: నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం మొదలైంది. గతంలో పలుమార్లు ఆనవాళ్లు నగరంలో లభించగా, తాజాగా బుధవారం రాత్రి నిర్వహించిన పోలీసు తనిఖీల్లో అనూహ్యంగా 33గ్రాముల ఎండీఎంఏ బయటపడింది. డ్రగ్స్ ను సరఫరా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుండి సెల్ ఫోన్లు, వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు డ్రగ్స్ మూలాలు కనుగొనే ప్రయత్నాలు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే విజయవాడలోని రామవరప్పాడు రింగ్ వద్ద అక్రమంగా డ్రగ్స్ రవాణా చేస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి సుమారు 33 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్ స్వాధీనం చేసుకున్నట్లు పటమట పోలీసులు తెలిపారు.పటమట పోలీసు స్టేషన్ పరిధిలో రామవరప్పాడు వద్ద అనుమానాస్పద వాహనాల తనిఖీల్లో భాగంగా బుధవారం రాత్రి సిఐ వి పవన్ కిశోర్, యస్.ఐ ఏ దుర్గాదేవి సిబ్బందితో కలసి వాహనాల తనిఖీ చేస్తుండగా రామవరప్పాడు ఫ్లై ఓవర్ వైపు నుండి విజయవాడ వైపు వెళ్తున్న అనుమానాస్పదంగా ఉన్న రెండు వాహనాలను తనిఖీ చేయగా, ఒక ఇనుప పెట్టెలో వైట్ కలర్ క్రిస్టల్ ఎండీఎంఏ డ్రగ్స్ ప్యాకెట్లు రెండు, పర్పుల్ కలర్ క్రిస్టల్ ఎండీఎంఏ డ్రగ్స్ ప్యాకెట్ ఒకటి, రెడ్ కలర్ క్రిస్టల్ ఎండీ ఎంబీ అడ్రస్ ప్యాకెట్ ఒకటి మొత్తం సుమారు 33 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ లభించాయి. రెండు బైకులతో పాటు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు 7 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.వీరు నూజివీడుకు చెందిన మనోహర్ అనే వ్యక్తి ద్వారా ఢిల్లీకి చెందిన రింకు నుండి ట్రాక్ ఆన్, డీటీడీసీ కొరియర్ల ద్వారా దిగుమతి చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది. డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిలో సనత్ నగర్ కు చెందిన తిరుమలశెట్టి జీవన్ కుమార్, టీచర్స్ కాలనీకి చెందిన బొంతు నితీశ్ కుమార్, యనమలకుదురుకు చెందిన తూలిమెల్లి తరుణ్ ప్రసాద్ లు ఉన్నారు. ప్రస్తుతం విజయవాడ నగరంలో డ్రగ్స్ లభించడం నగరంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.


## బెంగుళూరు ఘటనపై దిద్దబాటు చర్యలు

బెంగళూరు,ఆర్సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో చోటుచేసుకున్న విషాద ఘటనపై కర్ణాటక ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. బెంగళూరు పోలీస్ కమిషనర్తో పాటు తొక్కిసలాటతో సంబంధం ఉన్న ఇతర పోలీస్ ఉన్నతాధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు సీఎం సిద్ధరాయ్య ఆదేశాలు జారీ చేశారు. ఆర్సీబీ, డీఎన్ఏ ఈవెంట్ మేనేజ్మెంట్ ఏజెన్సీ, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులను అరెస్టు చేయాలని సీఎం ఆదేశించారు.

# నెల్లూరులో కరోనా కలకలం.. ఒకేసారి ఆరు కేసులు

నెల్లూరు: నెల్లూరు జిల్లాలో కరోనా కేసులు కలకలం సృష్టిస్తున్నాయి. దగ్గు జలుబుతో ఆసుపత్రికి చేరిన వారికి కరోనా టెస్టులు చేయడంతో ఒకేసారి 6 కేసులు బయటపడ్డాయి.కరుణ లక్షణాలు తక్కువగా ఉండడంతో ఐదుగురిని హోమ్ ఐసోలేషన్ పంపిన వైద్యులు.. మరో ఒకరికి నెల్లూరులోని కరోనా వార్డులో చికిత్స అందిస్తున్నారు.

ఇక, ఒకేసారి ఆరుగురికి కరోనా పాజిటివ్ నిర్ధారణ కావడంతో.. అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం. పల్మనాలజీ విభాగంలో కరోనా ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసింది.. మహిళకు, పురుషులకు ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేశారు అధికారులు.. కేరళ నుంచి వచ్చిన నర్సింగ్ స్టూడెంట్ కి కరోనా లక్షణాలు ఉండడంతో హోమ్ ఐసోలేషన్ లో చికిత్స అందిస్తున్నారు.. మళ్లీ కరోసా కేసులు పెరుగుతోన్న నేపథ్యంలో.. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. మాస్కులు ధరించాలని సూచిస్తున్నారు వైద్యాధికారులు.. కాగా,



దేశవ్యాప్తంగా కరోనా యాక్టివ్ కేసులు పెరుగుతూ వస్తున్నాయి.. ఆంధ్రప్రదేశ్‌లోనూ వరుసగా పాజిటివ్ కేసులు వెలుగు చూస్తూనే ఉన్నాయి..

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**